Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 99487 49799

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 94 విశాఖపట్నం, 18 జనవరి 2024 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## మహా సంక్రాంతి సంబరాలకు ఎంపీల ప్రశంస



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దేశంలో ఇంత ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఇక్కడే చూశామని పెట్రోలియం మరియు సహజ వాయువుల పార్లమెంటరీ కమిటీ చైర్మన్ రమేష్ బిదూరి ప్రశంసించారు. హెచ్ పీసీఎల్ సందర్శనకు వచ్చిన 5గురు పార్లమెంటు సభ్యులు రోడ్మల్ నాగర్, రమేష్ బిదూరి, రవిచంద్ర వృద్ధి రాజు, కాంతా కరడామ్, చింతాఅనూరాధ మంగళవారం సాయంత్రం జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాలకు విచ్చేసి ప్రాంగణమంతా పర్యటించి ఆనందాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్ఫూర్తి తో జీవీఎల్ నరసింహారావు సంక్రాంతి సందర్భంగా ఇన్ని వేల మందికి ఆనందంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం తమకు గర్వకారణంగా ఉందని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎం పీ లందరికీ తిరుపతి దేవస్థానం వేద పండితులు ఆశీస్సులు అందించారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ

(మిగతా 2లో)

## జనసేన పార్టీలో కొణతాల ?



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జనసేన పార్టీ అధినేతతో హైదరాబాదులో భేటీ అయిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ. రాష్ట్ర రాజకీయాలు, ఉత్తరాంధ్రలో రాజకీయ పరిస్థితులపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ చర్చలు. జనసేన పార్టీలో త్వరలో చేరనున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ. మంచిరోజు చూసుకొని ఈ నెలలోనే జనసేనలో చేరనున్న కొణతాల రామకృష్ణ. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుండి జనసేన తరుపున ఎంపీగా పోటీచేసే యోచనలో కొణతాల రామకృష్ణ. ఉత్తరాంధ్రలో సీనియర్ నాయకుడుగా , బీసీ సామాజికవర్గానికి చెందిన కొణతాల రామకృష్ణ 1989 నుండి 1996 వరకు అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడుగా పనిచేశారు. 1991 నుండి 1996 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుల కన్వీ నర్‌గా కొణతాల రామకృష్ణ పనిచేశారు. 2004 నుండి 2009 వరకు డా.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, న్యాయ తదితర శాఖలకు మంత్రిగా కొణతాల రామకృష్ణ పనిచేశారు. దివంగత నేత డా.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వైఎస్ఆర్‌సిపి లో పొలిటికల్ ఎఫైర్స్ కమిటి చైర్మన్‌గా పనిచేశారు.

2014 ఎన్నికల అనంతరం వైఎస్ఆర్‌సిపి కి రాజీనామా చేసి రాజకీయాలకు దూరంగా ఉంటూ ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాడుతున్నారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక తరుపున ఆ ప్రాంతం సమస్యలపై సదస్సులు, సమావేశాలు

(మిగతా 2లో)

## విశాఖ జైల్లో కోడి కత్తి శ్రీను ఆమరణ నిరాహార దీక్ష



2019 ఎన్నికల సమయంలో విశాఖ ఎయిర్ పోర్టులో వైసీపీ అధినేత, విపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ పై కోడి కత్తితో దాడి చేసిన వ్యవహారంలో నిందితుడు జనిపల్లి శ్రీనివాస్ అప్పటి నుంచీ జైల్లోనే ఉన్నాడు. శ్రీనివాస్ కు బెయిల్ కోసం ఆయన కుటుంబ సభ్యులు, లాయర్లు ఎడతెగని ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఈ కేసులో బాధితుడిగా ఉన్న సీఎం వైఎస్ జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వకపోవడమే. దీంతో చేసేది లేక శ్రీనివాస్, ఆయన కుటుంబం ఆమరణదీక్షకు దిగుతున్నారు.

కోడి కత్తితో దాడి కేసులో శ్రీనివాస్ కు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఐదేళ్లుగా ఆయన కుటుంబం కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉంది. అసలు దాడి చేసింది శ్రీనివాస్ కాదని, వైసీపీ నేత మజ్జి శ్రీను అంటూ ఆయన లాయర్లు కొత్త వాదనను కూడా తెరపైకి తెచ్చారు. మరోవైపు సీఎం జగన్ వచ్చి వాంగ్మూలం చెప్తే ఈ కేసును ముగించేందుకు కోర్టు కూడా సిద్ధంగానే ఉంది. అయినా సీఎం జగన్ ముందుకు రాకపోవడంతో శ్రీనుకు బెయిల్ రావడం లేదు. దీంతో ఆయన లాయర్లు, కోర్టు కూడా చేసేదేమీ లేకపోతోంది.

ఈ నేపథ్యంలో విశాఖ జైల్లోనే మగ్గుతున్న జనిపల్లి శ్రీనివాస్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇవాళ్టి నుంచి ఆమరణ నిరాహారదీక్షకు దిగాలని నిర్ణయించుకున్నాడు. సీఎం జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని, దాని ఆధారంగా తనకు కోర్టు బెయిల్ ఇస్తుందని శ్రీనివాస్ చెప్తున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ ఆమరణ దీక్షకు దిగుతుండటం సంచలనం రేపుతోంది. శ్రీనివాస్ కు ఏదైనా జరిగితే ఎన్నికల సమయంలో మరింత రచ్చ కావడం ఖాయం గా కనిపిస్తోంది..

మరోవైపు శ్రీనివాస్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా ఇవాళ్టి నుంచి విజయవాడలోని వారి ఇంట్లోనే ఆమరణ దీక్షకు దిగబోతున్నారు. శ్రీనివాస్ తల్లి, సోదరుడు కూడా అతనికి బెయిల్ ఇవ్వాలని కోరుతూ నిరాహారదీక్ష చేపట్టబోతున్నారు. దీంతో శ్రీనివాస్ కుటుంబం నిరాహారదీక్షల వ్యవహారం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారుతోంది. మరోవైపు ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరుతూ హైకోర్టులో సైతం వైఎస్ జగన్ పిటిషన్లు దాఖలు చేయడంతో ఈ కేసు ఇప్పట్లో తేలేలా లేదు.

విశాఖ సెంట్రల్ జైల్ లో కోడి కత్తి శ్రీను ప్రస్తుతానికి ఏ విధమైన నిరాహార దీక్ష చేయడం లేదు.. ఒక వేళ దీక్ష చేయాలి అంటే 24 గంటలముందు జైలు అధికారులకు లెటర్ ద్వారా సమాచారం ఇవ్వాలి... అలాంటి సమాచారం ఏమీ తమకు ఇవ్వలేదని సెంట్రల్ జైల్ అధికారులు మీడియాకు తెలియజేసారు.నేడు అనగా గురువారం కూడా దీక్ష చేసే అవకాశాలు లేవని పేర్కొన్నారు.

## బ్రహ్మాబాబా అవ్యక్త స్మృతి దినం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రజాపిత బ్రహ్మ కుమరిస్ సంస్థ స్థాపించిన బ్రహ్మ బాబా 55 వ అవ్యక్త స్మృతి దినోత్సవం ప్రపంచ శాంతి దినంగా పాటిస్తున్నారు. ఈ సందర్భంగా డాబా గార్డెన్స్ వి జే ఎఫ్ ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

రాజ్య సభ సభ్యుడు జీ వీ ఎల్ నరసింహా రావు మాట్లాడుతూ, ప్రపంచ దేశాలకు భారత్ ఆధ్యాత్మిక నాయకత్వం వహిస్తున్నదని అన్నారు. బ్రహ్మ కుమారిస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు.

మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మ కుమారీ బోధనలు ద్వారా విముక్తి కలుగుతుంది అన్నారు. ప్రధాని మోడీ దేశంలో యోగా కి విస్తృత ప్రాచుర్యం కల్పించారు.

కనుమరుగు అవుతున్న భోగి పండ్లు కార్యక్రమం ఏయూ సంక్రాంతి సంబరాలలో నిర్వహించాము అన్నారు. చరిత్ర, వారసత్వం సంస్కృతి పరిరక్షించుకోవాల్సిన అవసరం వుంది. ఈ సంస్థ ద్వారా

(మిగతా 2లో)

## మళ్లీ ఏయూ వీసీగా ప్రసాదరెడ్డి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని నియామకం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేసింది.గత నాలుగు సంవత్సరాలుగా ఆంధ్రవిశ్వవిద్యాలయం అభ్యున్నతికి అనునిత్యం కృషిసల్పిన ఆచార్య ప్రసాద రెడ్డి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రెండవ పర్యాయం వర్సిటీ ఉపకులపతిగా ఆయనను నియమించింది. ఆచార్య ప్రసాద రెడ్డికి ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్డి ఆచార్య వి.కృష్ణ మోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె. శ్రీనివాస రావు, ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

తన ప్రతిభతో వర్సిటీ రూపురేఖలను పూర్తిస్థాయిలో మార్పు చేస్తూ ఆయన చేసిన కృషి అనన్యసామాన్యం. స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను నెలకొల్పడం, చైర్ ప్రొఫెసర్‌ల సాధన వంటి వైవిధ్యమైన ప్రాజెక్టులతో ఏయూకు నూతన జవసత్వాలను ఆయన తీసుకువచ్చారు. ఇటీవల ఏయూను సందర్శించిన నాక్ నిపుణుల బృందం ఏయూకు నాక్ డబుల్ ప్లస్‌తో పాటు 3.74 సిజిపిఏ స్కోర్‌ని అందించడంలో ఆచార్య ప్రసాద రెడ్డి దార్శనిక పనితీరు ప్రధాన కారణం. జాతీయ స్థాయిలో ఏయూను మెదటి మూడు విశ్వవిద్యా లయాలలో ఒకటిగా నాక్ స్కోర్‌తో నిలపడం రాష్ట్రానికే గర్వకారణంగా నిలచింది.

ఆంధ్రవిశ్వవిద్యాలయ

(మిగతా 2లో)

## చంద్రబాబు పిటిషన్‌పై సుప్రీంలో విచారణ వాయిదా



దిల్లీ: ఫైబర్ నెట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోసారి

(మిగతా 2లో)






(మొదటి పేజీ తరువాయిలు)

## మహా సంక్రాంతి సంబరాలకు ఎంపీల ప్రశంస

సంబరాలు విజయవంతం చేసినందుకు టీం జీవీఎల్ సభ్యులను అభినందించారు. పారిశుధ్య కార్మికులు అందరినీ శాలువాలు కప్పి సత్కరించారు. నగర్ పోలీస్ కమిషనర్ రవి శంకర్ అయ్యన్నార్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి కార్యక్రమాలు జరిపిన తీరును ప్రశంసించారు. 30వ టౌన్ పోలీసులను కమీషనర్ సత్కరించారు.

## మళ్లీ ఏయూ వీసీగా ప్రసాదరెడ్డి

ఇంక్యుబేషన్ కేంద్రాలు ఆ హబ్, ఎలిమెంట్, ఫుట్ డెక్నాలజీ, జెనిటిక్స్ రీసెర్చ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ వంటివి నెలకొల్పి ఏయూకు జాతీయ స్థాయిలో పేరు తీసుకువచ్చారు. ఏయూలోని చారిత్రక భవనాలు, పరిపాలనా భవనం, హాస్టల్స్,గ్రంధాలయం వంటివి పూర్తిస్థాయిలో ఆధునీకరించి నూతన శోభను కల్పించారు. సుమారు రూ 400 కోట్లు విలువ చేసే పోలమాంబ ఆలయాన్ని ఆనుకుని ఉన్న విలువైన ఏయూ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవడంలో ఆచార్య ప్రసాద రెడ్డి ఎంతో కృషి చేసారు. రూసా నిధులతో చేపట్టిన అత్యంత పటిష్ట నిర్మాణాలు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రశంసలు అందుకున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి జాతీయ స్థాయిలో ఏయూ మెదటి పది స్థానాలలో నిలవాలని ఆకాంక్షించారు. ఏయూకు వచ్చిన సందర్భంలో ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి సభాముఖంగా వ్యక్తం చేసారు. దానిని సాకారం చేస్తూ జాతీయ స్థాయిలో నాక్ గుర్తింపులో దేశంలోనే రెండవ స్థానంలో ఏ డబల్ ప్లస్‌తో, 3.74 సిజిపిఏ సాధించి నూతన చరిత్రను ఏయూ లిఖించింది. దీనికోసం వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తొలినాటి నుంచి అనుక్షణం విశేష కృషి చేసారు.

**విద్యార్థులకు అభిమాన టీచర్....**

వర్సిటీలో విద్యార్థులకు అభిమాన టీచర్‌గా ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నిలచారు. వేలాది మంది విద్యార్థులకు ఆయన స్ఫూర్తి ప్రదాత. మూడున్నర దశాబ్దాలకు పైగా బోధనలో ఉన్న ఆయన తరగతిగదిలో ఆచార్యునిగా భోదన చేయడానికి అమితమైన ఆసక్తి చూపుతారు. నిత్యం విద్యార్థులను స్ఫూర్తిని పంచుతూ వారి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసారు. ఏయూలో నూతన కోర్సులను ప్రారంభించడం, ప్రస్తుతం ఉన్న కోర్సులకు డిమాండ్ పెంచడంలో ఆయన అనుసరించిన విధానాలు ఇతర విశ్వవిద్యాలయాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

**ప్లేస్‌మెంట్స్‌లో సరికొత్త రికార్డ్....**

ఆచార్య ప్రసాద రెడ్డి తీసుకున్న నిర్ణయాలు వర్సిటీ విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నాయి. ఆయన వీసీగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యార్థులకు ఉపాధి కల్పన ధ్యేయంగా ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు. ఆర్ట్స్, న్యాయ కోర్సుల విద్యార్థులకు సైతం మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించారు. గత నాలుగు సంవత్సరాలుగా ఏయూలో ప్రాంగణ నియామకాల సంఖ్య గణనీయంగా పెరిగింది. వర్సిటీ చరిత్రలో సరికొత్త రికార్డుగా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినికి 84.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం లభించింది. అదే విధంగా కోర్ బ్రాంచ్‌లు చదివిన విద్యార్థులకు రెండు కంటే ఎక్కువ ప్లేస్‌మెంట్‌లు వచ్చే విధంగా చేసి ఈ కోర్సులపట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారు.

**పరిపాలనాదక్షుడు...**

విశ్వవిద్యాలయంలో చేరిన నాటి నుంచి నాయకత్వ లక్షణాలను కలిగిన ఆచార్య ప్రసాద రెడ్డి వర్సిటీలో విభిన్నమైన పదవులను నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గా 2008 నుంచి 2011, 2011 నుంచి 2012 వరకు వర్సిటీ రెక్టర్‌గా, 2019 నుంచి వర్సిటీ వీసీగా బాధ్యతలను నిర్వర్తించారు. ఏయూ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్ డైరెక్టర్‌గా, ఏయూ యోగా కేంద్రం సంచాలకులుగా, ఏయూ ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్‌గా సమర్థ సేవలు అందించారు. వర్సిటీలో రిజిస్ట్రార్, రెక్టార్ వంటి ఉన్నత పదవులను నిర్వహించిన తరువాత విభాగాధిపతిగా సైతం ఆయన బాధ్యతలు స్వీకరించి తాను పనిచేసిన కంప్యూటర్ సైన్స్ స్టిమ్స్ ఇంజనీరింగ్ విభాగాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి, విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఉద్యోగాల కల్పనకు కృషిచేసి తనదైన మార్క్‌ని చూపారు.

## జనసేన పార్టీలో కొణతాల ?

నిర్వహిస్తూ ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువస్తున్నారు. విశాఖపట్నంలో రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఉత్తరాంధ్రలో, ఢిల్లీలో అనేక ఉద్యమాలు కొణతాల రామకృష్ణ నిర్వహించారు. వెనుకడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు విభజన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ కొణతాల రామకృష్ణ రాష్ట్ర హైకోర్టులో పిల్ ను దాఖలు చేశారు.

## చంద్రబాబు పిటిషన్‌పై సుప్రీంలో విచారణ వాయిదా

వాయిదా పడింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం విచారణ చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనం వద్ద కేసు గురించి ప్రస్తావించారు. దీనిపై స్పందించిన జస్టిస్ అనిరుద్ధ బోస్.. ఈరోజు బెంచ్ కూర్చోవడం లేదని తెలిపారు. విచారణకు మరో తేదీ ఇస్తామని వెల్లడించారు.

ఫైబర్ నెట్ కేసులోని అంశాలు 17-ఏ సెక్షన్‌తో ముడిపడి ఉన్నందున ధర్మాసనం గతంలో ఈ కేసును వాయిదా వేసింది. అప్పటివరకు చంద్రబాబుపై తదుపరి చర్యలు తీసుకోవద్దంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. అయితే మంగళవారం సెక్షన్ 17-ఏపై ధర్మాసనం భిన్న తీర్పులు వెలువరించిన నేపథ్యంలో ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు వస్తాయన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

## బ్రహ్మాబాబా అవ్యక్త స్మృతి దినం

ప్రజలకు ఆధ్యాత్మిక చింతన అందిస్తున్నారు అని కొనియాడారు.

సంస్థ ప్రతినిధి రామేశ్వరీ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక విప్లవవీరుడు ప్రజాపిత బ్రహ్మ 55వ సంస్మరణ దినము అని గుర్తు చేశారు.

జనవరి 18 (1969) ప్రపంచ చరిత్రలోనే ఒక అద్భుతమైనరోజు. లేఖ రాజ్, శ్రీవైష్ణుడు కృపలాని వంశంలో సింధు హైదరాబాద్ లో పుట్టిన లేఖ రాజ్ 60 ఏట తమకు కలిగిన దివ్య సాక్షాత్కారముల తరువాత ప్రజాపిత బ్రహ్మ అనే కర్తవ్యపరమైన పేరుతో విశ్వ యుగ పరివర్తనకు నాంది పల్కిన ఏకైక మానవ సేవ సమాజ సంస్కర్త. అను నిత్యం 12 మంది గురువులను సేవిస్తూ సత సాంగత్యముతో పాటు నిత్యం భగవద్గీత పారాయణం చేస్తూ దాన పున్యాలను చేర్చే మహా భక్తుడుగా పేరు గాంచాడు. 1930 నాటికి భారత దేశంలో అతి పెద్ద పేరు మోసిన వజ్రాలవ్యాపారి. 1936 లో వారు తమకు కల్గిన దివ్య సాక్షాత్కారాల అనంతరం అనంతమైన వైరాగ్యంతో పరమాత్మని నిర్దేశానుసారం తమ యావదాస్తిని మాతలకు, కన్యలకు సమర్పించి తాను ట్రస్టిగాఅయ్యి విశ్వసేవలో పరమేశ్వరునికి వాహనమైన ప్రమదగణము నందిగ మనకు పరిచయము చేయబడినారు. ప్రజాపిత బ్రహ్మచాచా కలియుగ పతిత మానవులను పావన దేవతలుగ తయారుచేసే ఈశ్వరీయ కార్యాన్ని నిర్వర్తించే ఈశ్వరీయ అగ్నకు నిబద్ధుడైనాడు. బ్రహ్మజ్ఞానంతో కులమత, లింగ, వర్ణ వయో బేధాలు లేకుండ నూతన స్వర్ణమ యుగ స్థాపనలో నిరంతర సేవలనందిస్తు 'తమే వారసులను అనేకమందిని బ్రహ్మకుమారీ, బ్రహ్మకుమారులను తయారు చేసారు. అశుద్ధ, ఆహార పానీయాలు సేవనము, అపవిత్ర వికారీ జీవనం నుంచి ముక్తులుగ చేసారు. 1969 జనవరి 18వ తేదీన తమ పార్థివ దేహాన్ని త్యాగం చేసి నేటికి తమ సూక్ష్మ శరీరములో విశ్వ నవ నిర్మాణ కార్యంలో దేశ విదేశాల్లో ఆత్మ జాగృతి చేస్తున్నారు. అక్మశ్వరమన్నారు పురాణపురుషుడు, ఆదిదేవ్, భాగవతోత్తముడు అయిన ప్రజాపిత బ్రహ్మను గురించిన అద్భుతమైన రహస్యాలు ఇంకా ఇంతవరకు ఎప్పుడూ యదార్థంగ తెలుసు కోలేక పోయారు. ఈనెల 21 వతేది, ఆదివారం సాయంకాలం బీచ్ రోడ్ అన్నమయ్య విగ్రహం దగ్గర అమరజ్యోతి బుర్రకథా బృందం వారిచే పితాశ్రీ బ్రహ్మబాబా, అద్భుత పావన జీవిత చరిత్రను విని, చూసి తరించవలసిందిగా కోరారు. బ్రహ్మ పోస్టరును జీ వీ ఎల్ ఆవిష్కరించారు. ఆయనను సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సమాచారం ఎడిటర్ వీరభద్ర రావు , సంస్థ ప్రతినిధులు బీ.కే.శివ లీల, సశికల, సత్యవతి, బీ.కే.వేని పాల్గొన్నారు.


విశాఖ సమాచారమ్

ప్రతులకు,

ప్రకటనలకు

సెల్:

9393949345

8247526179


**పంచాంగం**

గురువారం 18-01-2024

శోభకృత్ నామ సంవత్సరము

దక్షిణాయణం హేమంత ఋతువు

పుష్య మాసం

తిథి : శు. అష్టమి రా. 01.15

నక్షత్రం : రేవతి ఉ. 08.33

వర్జ్యం : తె. 05.28 ల 06.58

## కేఆర్ఎంబీ చేతికి నాగార్జున సాగర్ భద్రత, కార్యకలాపాలు



దిల్లీ: ఇటీవల జరిగిన ఘటనల దృష్ట్యా నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణపై రెండు రాష్ట్రాల అధికారులతో బుధవారం కేంద్ర జల్‌శక్తిశాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమీక్ష నిర్వహించారు. సాగర్ నిర్వహణ అంతా కేఆర్ఎంబీకి అప్పగించే విషయమై ప్రభుత్వాలతో చర్చించిన తర్వాతే నిర్ణయం చెబుతామని రెండు రాష్ట్రాల అధికారులు తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టులు, అవుట్‌లెట్స్, సాంకేతిక పరిమితులపైనా నిర్ణయం తీసుకోవాలని అధికారులు కోరారు. ఏఏ అవుట్‌లెట్స్ ఎవరి పరిధిలో ఉండాలనేది తేలాల్సి ఉందన్నారు.

సాంకేతిక అంశాలపై ఇద్దరు సీఈలు చర్చించి నిర్ణయానికి రావాలని జల్‌శక్తిశాఖ సూచించింది. దీనిపై నివేదిక వచ్చాకే తదుపరి భేటీ ఉంటుందని స్పష్టం చేసింది. సాగర్ భద్రత, కార్యకలాపాలను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్రం ఆదేశించినట్టు సమాచారం. సాగర్ వద్ద సీఆర్‌పీఎఫ్ పర్యవేక్షణ కొనసాగించాలని ఏపీ, తెలంగాణ అధికారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్లు జల్‌శక్తిశాఖ అధికారులు తెలిపారు.

## రక్తదానం ప్రాణ దానంతో సమానం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రక్తదానం చేయడం ఒకరికి ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. బుధవారం సామాజిక సమతా సంకల్పం మహోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్త దానం చేశారు. రక్తదానం చేసినట్లయితే మన శరీరంలో రక్తం తగ్గకపోగా కొత్త రక్తం చేకూరుతుందన్నారు. ఆరోగ్య వంతులైన వారందరూ రక్తదానం తప్పక చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఏ. హేమంత్, డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రీనివాస్ రావు, డి ఆర్ డి ఏ పి.డి. శచీదేవి ఏపిడి డైజీ సాంఘిక సంక్షేమ శాఖ ఏడి అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.


# శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.




## కార్డోరియం ప్లస్

కావల్సిన వారు సంప్రదించండి:

9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీపీఎంపీ, బీపీఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్‌నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి. స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.

మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.

అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)

9-3-16, పిఠాపురం కోలని,

విశాఖపట్నం- 530003

ఫోన్: 8247526179

Compli

# విశాఖ సమాచారమ్

గురువారం 18-01-2024


# మిలాన్ - 2024 వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్ లుగా జరగనున్న మిలాన్ - 2024 వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని, సంబంధిత ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున సూచించారు. స్థానిక వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో నేవీ, ఎయిర్ పోర్టు, పోర్ట్ అథారిటీ, కస్టమ్స్, రెవెన్యూ, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, పోలీసు, పర్యాటక శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు.

సమావేశంలో భాగంగా మిలాన్ - 2024 ఇన్‌ఛార్జి, నేవల్ కమోడో సిరజ్ అజాద్ 12వ ఎడిషన్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 19 నుంచి 23వ తేదీ వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27వ తేదీ వరకు సీ ఫేజ్ మిలాన్ - 2024 కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి దేశ విదేశాల నుంచి అతిథులు విచ్చేస్తున్నారని వివరించారు. ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. 50 విదేశీ నౌకలు, 40 వరకు యుద్ధ నౌకలు, సబ్ మెరైన్లు మిలాన్ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 18, 19వ తేదీల్లో దేశ, విదేశాల నుంచి వచ్చే నౌకలు విశాఖపట్టణం పోర్టు, నేవల్ డాక్ యార్డుకు చేరుకుంటాయని చెప్పారు. 19వ తేదీన విదేశీ ప్రముఖులు నగరానికి విచ్చేస్తారని పేర్కొన్నారు. 21వ తేదీ నుంచి ప్రధాన కార్యక్రమాలు ఉంటాయని దానిలో భాగంగా 21వ తేదీన కేంద్ర రక్షణ శాఖ మంత్రి విచ్చేస్తున్నారని వెల్లడించారు. నేవల్ ఆడిటోరియం సముద్రికలో 21న హార్బర్ ఫేజ్ వేడుకలు ప్రారంభమవుతాయని సిరజ్ అజాద్ వివరించారు. అలాగే కేంద్ర రక్షణ శాఖ మంత్రి చేతుల మీదుగా నేవల్ బేస్ లో అదే రోజు సాయంత్రం మిలాన్ విలేజ్ ప్రారంభోత్సవం కూడా ఉంటుందన్నారు. 22వ తేదీన ఉప రాష్ట్రపతి విచ్చేస్తున్నారని నేవల్ ఆడిటోరియం సముద్రికలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. అదే రోజు సాయంత్రం బీచ్ వేదికగా జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచ్చేసి వేడుకల్లో భాగస్వామ్యం అవుతారని వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున మాట్లాడుతూ విశాఖపట్టం వేదికగా ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హార్బర్ ఫేజ్ (ఆర్.కె. బీచ్ ప్రాంతంలో జరిగే) మిలాన్ - 2024 వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వీవీఐపీ, వీఐపీ రక్షణ ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు చెప్పారు. ప్రజలు వీక్షించేందుకు అనువుగా బీచ్ ఏరియాలో బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి, బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత పొరపాట్లను దృష్టిలో ఉంచుకొని పటిష్ట ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఏర్పాట్లలో భాగంగా ముందుగా ఆయా విభాగాల అధికారులు వేడుకలు జరిగే ప్రాంతాల్లో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని సూచించారు. సీసీ టీవీ కెమెరాలు, ఎల్.ఈ.డి. స్క్రీన్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఏపీఐఐసీ, ఏయూ గ్రౌండ్స్‌లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సుందరీకరణ పనులు చేపట్టాలని, విశ్వప్రియ ఫంక్షన్ హాలు, విశాఖ మ్యూజియంలో కూడా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో సముద్రంలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా మత్స్యకారులకు ముందుగానే సమాచారం అందించి అప్రమత్తం చేయాలని మత్స్యశాఖ జేడీకి సూచించారు. డ్రోన్లు, గాలిపటాలు ఎగురవేయకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశ విదేశాల నుంచి ప్రముఖులు రానున్న నేపథ్యంలో ఎలాంటి లోపం జరగకుండా అన్ని విభాగాల అధికారులు, నేవీ అధికారులు సమన్వయం వహించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని, వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. బీచ్ రోడ్లో శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అతిథులను ఆకర్షించేలా నిర్వహించాలన్నారు. అతిథులకు నగరంలో పలు పర్యాటక ప్రాంతాలను చూపించాలని, సంబంధిత ఏర్పాట్లు చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు.

సమావేశంలో కమోడో రాజ్ నీష్ శర్మ, పలువురు నేవీ కమాండర్లు, లెఫ్టినెంట్ కమాండర్లు, డీసీపీ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఎఫ్ వో, వీఎంఆర్డీఏ సెక్రటరీ, జీవీఎంసీ ఈఈ, మత్స్యశాఖ జేడీ, సమాచార పౌర సంబంధాల శాఖ జేడీలతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాములవారికి అత్తవారి కానుకలు

అయోధ్య రాముడికి అత్తగారి ఇంటి నుండి కానుకలు, సంభారాలు వచ్చాయి.

అల్లుడుగారు ఇల్లు కట్టుకుంటే అత్తగారు కానుకలూ., సంభారాలు పంపడం ఆనవాయితీ.

అలాగే మేనల్లుడు ఇల్లు కట్టుకుంటే కూడా కానుకలు సంభారాలు పంపడం కూడా ఆనవాయితే.

దీనిని కచ్చితంగా పాటించారు... మరి.

అయోధ్యలో శ్రీరామచంద్రుడు 495 సం.ల తర్వాత నూతనంగా ఇల్లు నిర్మించుకొని జనవరి 22వ తేదీన గృహప్రవేశం చేస్తుండగా అమ్మమ్మ గారి ఇంటి నుండి..., అదేనండి...., వాళ్ళ ఊరు చత్తీస్గడ్ రాష్ట్రంలోని రాయపూర్..., కౌసల్యాదేవి తల్లి గారి ఊరు అక్కడినుండి మేనమామలందరూ కలిసి సంభారాలు తీసుకొచ్చారు ఇలా తేవడాన్ని వాళ్ళేమో "మాయిరా" అంటారు.

ఇప్పుడేమో రెండు ట్రక్కుల నిండుగా శ్రీరాముల వారి అత్తగారి ఊరు మిథిలానగరం అదేనండి నేపాల్ లోని జనక్పూర్, అక్కడి నుండి తమ ఆడపడుచుకు, తమ కూతురుగా భావించే సీతమ్మ తల్లికి.., తామంతా ప్రేమగా పిలిచే 'కిషోరీ' కి, అభరణాలు, సంభారాలు, సారే, కొత్త బట్టలు, పండ్ల బుట్టలు.... అనేకం తీసుకుని వచ్చి సమర్పించుకున్నారు.. (వాళ్ళేమో "భార్" అంటారు.) ఆయన ప్రతినిధి.., కోర్టులో కూడా బాలరాముడి ప్రతినిధియే అయిన శ్రీచంపత్ రాయ్ గారికి అందించి తమ కర్తవ్యాన్ని నిర్వర్తించామని ఆనందపడిపోతూ.., ఆనంద భాష్పాలు రాలుస్తూ.., తిరుగు ప్రయాణమయ్యారు.

తిరుగు ప్రయాణంలో జనక్పూర్ జానకి మాత ఆలయం ప్రధాన పూజారి చెప్పిన మాట ఏమిటంటే త్రేతాయుగంలో శ్రీరామలక్ష్మణ భరత శతృఘ్నులకు - సీతమ్మ తల్లి ఊర్మిళాదేవి మండవి శృతకీర్తులను ఇచ్చి వివాహం చేసి అనేక సంభారాలతో సాగనంపాము... ఆయనకు ఇచ్చిన భూములు ఆయనకు ఇచ్చిన కట్నాలు అన్నింటిని ప్రతి సంవత్సరము సరిచూసి అయోధ్యలో ఇచ్చుకుంటూనే ఉంటాము... కలియుగంలో ఇప్పుడు కూడా ఈ ఆనవాయితీని పాటించామని అన్నారు.

**మీకు మరొక విషయం చెప్పాలి:**

అత్తారింటికి వెళ్లిన ఆడకూతురి అత్తగారింటి వాళ్లను ఉద్దేశించి ఎత్తిపొడుపులతో.. హాస్యరసమైన పాటలు పాడుతూ కవ్విస్తుంటారు వీటిని "గారి" అని అంటారు... మిథిలా వాసుల హాస్యపు పాటలు చేష్టలు చూసి తీరవలసినదే. 70 - 80 ఏళ్ల వృద్ధులు సైతం రామున్ని బావగా భావించి విచిత్రమైన విన్యాసాలతో పాటలు పాడుతూ కవ్విస్తుండే మాటలు మాట్లాడుతూ ఉండడం అక్కడి సంప్రదాయం అంత మాత్రమే కాదు యావద్దేశం అంతటా ఈ పద్ధతి కొంచెమో గొప్పో ఉండనే ఉంది.

ఎంతైనా మన హిందువులు.., యుగాలు మారినా.., తరాలు మారినా తమ సాంప్రదాయాలను నిలబెట్టుకుంటూనే ఉన్నారు.

## నేడు విశాఖకు ఎన్నికల జాబితా పరిశీలకులు జె.శ్యామలరావు రాక

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా ఎన్నికల జాబితా పరిశీలకులు, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జె. శ్యామలరావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు విశాఖపట్టణం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్వోలు, ఇతర అధికారులతో ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించనున్నారని జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్, హైలీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 16 రోజులు చేసిన సమ్మె సందర్భంగా మున్సిపల్ రంగంలో ఇంజనీరింగ్ కార్మికులకు హైలీ స్కిల్ వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సమ్మెలో ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేసింది. ఈ కమిటీకి కన్వీనర్ గా శివపార్వతి (డిప్యూటీ డైరెక్టర్,మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) గారికి 17 -1- 2024 బుధవారం అమరావతిలో జి.వి.ఎం.సి.వాటర్ ఫిల్ట్ రేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఉపాధ్యక్షులు డి.శంకర రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రవణ్, రాష్ట్ర సీనియర్ నాయకులు సోమయ్య గార్లు కలిసి జీవీఎంసీ పరిధిలో నీటి సరఫరా, వెటర్నరీ, అర్టికల్చర్ పార్కులు, క్లాప్ డ్రైవర్స్, ఈ ఆటో తోపాటు ఇంజనీరింగ్ సెక్షన్ లో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు సెమి స్కిల్డు, స్కిల్డ్, హైలిస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించి వివరించడం జరిగింది. పనిముట్లు యంత్రాలపైన పనిచేసే కార్మికులకు ఒక సంవత్సరం అనుభవం ఉన్న వారికి వేతనాలు చెల్లించాలని, ఐటిఐ క్వాలిఫికేషన్ ఉన్నవారికి స్కిల్డ్ వేత్తనాలు, డిప్లమో, డిగ్రీ క్వాలిఫికేషన్ ఉన్న వారికి హైలి స్కిల్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 20 ఏళ్లగా సిఐటియు ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై కృషి చేస్తున్నదని అన్నారు. మొత్తం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ప్రయత్నం చేస్తుంది. కలెక్టర్ నోటి ఫైడ్ వేతనాలు కాకుండా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో ప్రకారం జీతాలు తీసుకుంటే భవిష్యత్తులో పిఆర్సి వేతనాలు సాధించుకోవడం జరుగుతుంది. కాబట్టి ఇది భవిష్యత్తులో కార్మికులందరికీ ఉపయోగపడే విధంగా సిఐటియు కృషి చేస్తుంది.

## మూగ సైగలతో వాదించిన మహిళా న్యాయవాది



**న్యూ ఢిల్లీ:** సుప్రీంకోర్టులో సైగల భాషతో వాదించిన మహిళా న్యాయ వాది,ఇటీవల సుప్రీంకోర్టులో జరిగిన ఓ కేసు విచారణలో సైగల భాషతో వాదించి సారా సన్నీ అనే మహిళా న్యాయవాది వార్తల్లో నిలిచారు.

బధిరురాలు అయిన ఈమె కర్ణాటక బార్ కౌన్సిల్‌లో సభ్యురాలు. సైన్ లాంగ్వేజ్‌లో వాదనలు జరగటం దేశంలో ఇదే మొదటిసారి. ఈమె వాదనను ఇండియన్ సైన్ లాంగ్వేజ్ వ్యాఖ్యాత సౌరవ్ రామ్ చౌదరి అనువదించారు.

## ఎపిలోని అన్ని నియోజక వర్గాల్లో జైభారత్ పోటీ చేస్తుంది: జెడి




ఏపీలోని అన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని లక్ష్మీనారాయణ ప్రకటించారు.

తమ జై భారత్ నేషనల్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారని వెల్లడించారు.

ఎన్నికల్లో పోటీ చేస్తాం టికెట్ ఇవ్వండి అని అడుగుతున్నారని తెలిపారు.

మరో మూడ్రోజుల్లో తమ పార్టీ మేనిఫెస్టో ప్రకటిస్తున్నామని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

అభివృద్ధే ప్రధానంగా ఉపాధి, రైతుల సంక్షేమం కోణంలో తమ మేనిఫెస్టో ఉంటుందని వివరించారు.

## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆర్‌కే బీచ్ లో రత్తదాన శిబిరం

స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి వర్ధంతి పురస్కరించుకొని 18 జనవరి 2024 నేడు ఉదయం 9 గంటలకు ఆర్కే బీచ్ నందుగల ఎన్టీఆర్ విగ్రహం కు నివాళులర్పించి, అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించబడును. ఈ కార్యక్రమం నకు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నియోజవర్గ ఇన్చార్జిలు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, వార్డు నాయకులు పాల్గొంటారు.




# ఈ అలవాట్లతో బరువు తగ్గరు



ఊబకాయం. ప్రస్తుత సమాజంలో ఎక్కువగా ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఇది. ఈ ఊబకాయం చాలా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. ఊబకాయంతో బాధపడేవారు ఏ పనీ సక్రమంగా చేసుకోలేరు. ఊబకాయం సమస్య వచ్చినప్పుడు దానితో పాటు ఆరోగ్య సమస్యలు కూడా ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అయితే బరువు తగ్గించుకుంటే ఆరోగ్యంగా ఉంటామని భావించి, బరువు తగ్గే క్రమంలో కొన్ని పొరపాట్లు చాలామంది చేస్తూ ఉంటారు.

ఎక్కువ మందికి ఉదయం లేవగానే కాఫీ, టీ తాగే అలవాటు ఉంటుంది. కాఫీ, టీ తాగడంతో మూత్ర రూపంలో నీటిని శరీరం బయటకు పంపిస్తుంది. దీంతో త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతారు. దీనివల్ల జీవక్రియల పనితీరు కూడా మందగిస్తుంది. బరువు తగ్గాలని భావించేవారు కాఫీ, టీ మానుకుంటే మంచిది. కాఫీ, టీ మానుకోలేకపోతే బరువు తగ్గరు. కాఫీ, టీలకు బదులు గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ పిండుకొని తాగాలి.

దీనివల్ల జీవక్రియల పనితీరు మెరుగుపడుతుంది. టాక్సిన్స్ బయటకు వచ్చేస్తాయి. ఫలితంగా బరువు తగ్గుతుంది. కొంత మంది ఉదయం లేవగానే బ్రేక్ ఫాస్ట్‌గా బ్రెడ్ తింటారు. దీనిలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల కడుపు నిండిన భావన కలగదు. ఇక స్వీట్స్, చక్కెరతో చేసిన పదార్థాలు తింటే బరువు పెరుగుతారు. కార్బోహైడ్రేట్లను కాకుండా ప్రోటీన్లను ఆహారంగా తీసుకోవాలి.

గుడ్లు, పాలు, ఓట్స్, పండ్లు, నట్స్ తీసుకోవడంతో సంతృప్త హార్మోన్ల స్థాయిలు పెరుగుతాయి. ఇలా చేయడంతో బరువు తగ్గే వీలుంటుంది. బరువు తగ్గాలనుకునే వారు చక్కెరకు బదులుగా ఆర్టిఫిషియల్ స్వీట్నర్స్ వాడుతారు. ఇక వీటిని తీసుకోవడం వల్ల కూడా అదనపు క్యాలరీలు శరీరంలో చేరుతాయి. ఆర్టిఫిషియల్ స్వీట్నర్స్ వల్ల బరువు తగ్గకపోగా బరువు మరింత పెరుగుతారు.

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎప్పుడైనా సరే బాగా ఆకలి వేసే దాకా ఎదురు చూడాలి. మధ్యలో చిరుతిళ్ళు పొరపాటున కూడా తినకూడదు. అలా చిరుతిళ్లు ఎక్కువగా తినేవారు బరువు పెరుగుతారు. చిరుతిళ్ళకు బదులు సమయానికి అల్పాహారాన్ని, భోజనాన్ని ముగించాలి. సీజన్లో దొరికే పండ్లను తినొచ్చు.

ఇక ఆలస్యంగా నిద్రలేవడం, వ్యాయామం ఆలస్యంగా చేయడం, ఆ తర్వాత అల్పాహారం కూడా ఆలస్యంగా చేయడం, ఎప్పుడు పడితే అప్పుడు నిద్రపోవడం వంటి చర్యలు బరువును విపరీతంగా పెంచుతాయి. బరువు అదుపులో ఉండాలి అంటే ముఖ్యంగా పాటించవలసిన నియమం సరైన సమయానికి నిద్ర లేవడం, భోజనం చేయడం. ఎంత వ్యాయామం చేసినా, ఎన్ని ఆహార నియమాలు పాటించినా సమయం ప్రకారం చేయకపోతే ఫలితం ఉండదు.

# బొప్పాయి పండు గింజలతో ఆరోగ్యం





బొప్పాయి పండు చాలా రుచిగా ఉంటుంది. దీనిని తినడానికి చాలా మంది ఇష్టపడతారు. కేవలం ఈ పండు మాత్రమే కాదు. ఈ పండు విత్తనాలు కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ, మనం పండు తింటే ఆ విత్తనాలను పడేస్తాం. కానీ వీటిని కూడా తీసుకుంటే చాలా సమస్యలు దూరమవుతాయి. వాటిని ఎలా తీసుకోవాలి. తింటే ఏమవుతుందో తెలుసుకోండి.

ఎలా తీసుకోవాలి..

ఈ గింజల్ని నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగాలి. వీటిని తాగడం వల్ల బాడీని, బ్లడ్‌ని క్లీన్ చేస్తుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. అంతే కాదు బరువు కూడా తగ్గుతారు.

బొప్పాయి తింటే కలిగే లాభాలలో కొన్ని :

**జీర్ణ వ్యవస్థకి మంచిది** : బొప్పాయి పండు గింజల్ని నానబెట్టి ఆ నీటిని ఖాళీ కడుపుతో తీసుకుంటే మనకి ఫైబర్ అందుతుంది. ప్రేగు కదలికలు మెరుగవుతాయి. దీంతో మలబద్ధకం దూరమవుతుంది. బొప్పాయి పండ్ల గింజల్ని తంటే జీర్ణ సమస్యలు దూరమవుతాయి.

**టాక్సిన్స్** : బొప్పాయి గింజల్లోని కొన్ని పదార్థాలు మన బాడీలోని టాక్సిన్స్‌ని బయటికి పంపుతాయి. దీంతో మన బాడీ క్లీన్ అవుతుంది. కాలేయ పనితీరు మెరుగవుతుంది. నానబెట్టిన బొప్పాయి గింజల నీటిని తాగితే బాడీ, కాలేయ సమస్యలు తగ్గుతాయి.

**ఇమ్యూనిటీ** : పరగడపునే ఈ నీటిని తాగితే ఇమ్యూనిటీ పెరుగుతుంది. బొప్పాయి గింజల్లోని యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఇమ్యూనిటీని బలంగా చేసి ఇన్ఫెక్షన్స్ దూరమవుతాయి.

**బరువు తగ్గడం** : బొప్పాయి గింజల తీసుకుంటే ఊబకాయ సమస్య తగ్గుతుంది. ఈ గింజల నీటిని పరగడపున తాగితే నడుము ప్రాంతంలోని కొవ్వు కరిగి కడుపు నిండిన ఫీలింగ్ వస్తుంది. దీని వల్ల జంక్ ఫుడ్ తినకుండా ఉంటారు. దీని వల్ల జీర్ణశక్తి, జీవక్రియకి మంచిది. మొత్తం బరువుని కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తుంది.

**గుండె ఆరోగ్యానికి** : బొప్పాయి గింజలని నానబెట్టి తింటే మన రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది. ఇది గుండె జబ్బులకి చాలా మంచిది. హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. చిన్న వయసులోని గుండె సమస్యలు రాకుండా ఉండేందుకు వీటిని తీసుకుంటే చాలా మంచిది.

**నీటిని తయారు చేయడం :**

ముందుగా పండిన బొప్పాయి పండును తీసుకుని బయటికి తీసి నీటితో బాగా కడగాలి. వీటిని రాత్రంతా నీటిలో నానబెట్టాలి. పరగడపున ఉదయాన్నే తాగాలి. కావాలంటే కొద్దిగా తేనెతో కలిపి తీసుకోవచ్చు. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ముందుగా డాక్టర్‌ని సంప్రదించండి.

# రోజూ స్క్వాట్స్ చేస్తే లాభాలేంటి?






స్క్వాట్స్. ఎలాంటి ఎక్విప్‌మెంట్ లేకుండా ఎక్కడైనా చేయగల ఈ ఎక్సర్‌సైజ్‌తో చాలా లాభాలు ఉంటాయి. దీనిని ఆడ, మగ ఎవరైనా చేయొచ్చు. వీటిని రెగ్యులర్‌గా ముఖ్యంగా ఆరు సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి.

**మెరుగైన పనితీరు** : ఈ వర్కౌట్ చేయడం వల్ల బాడీలోని ప్రతి పార్ట్ బలంగా మారుతుంది. దీనిని చేయడం వల్ల శరీరం మొత్తం బలంగా మారి శరీర పనితీరు మెరుగ్గా అవుతుంది. కాబట్టి, రెగ్యులర్‌గా చేయడం మంచిది.

**అథ్లెట్స్‌కి మంచిది** : స్క్వాట్స్ చేయడం స్పోర్ట్స్ ఆడేవారికి చాలా మంచిది. దీనిని చేయడం వల్ల మీ పనితీరు అనేక రెట్లు పెరుగుతుంది. స్క్వాట్స్ మీ మొత్తం శరీరానికి చాలా మంచిది. ముఖ్యంగా కండరాల బలంగా మారతాయి. దీంతో అథ్లెట్స్‌కి చాలా మంచిది.

**టోన్ అవ్వడం** : స్క్వాట్స్ చేస్తే బాడీ షేప్ కూడా అందంగా మారుతుంది. బాడీ టోన్ అవుతుంది. ముఖ్యంగా నడుము కింది భాగంలో తొడల నుంచి పాదాల వరకూ కాళ్ళు టోన్ అవుతాయి.

**కేలరీలు బర్న్** : వర్కౌట్ చేసినప్పుడు కేలరీలను బర్న్ అవుతాయి. ఈ స్క్వాట్స్‌ని మీ స్ట్రెంథ్ ట్రైనింగ్ రొటీన్‌లో యాడ్ చేస్తే కేలరీలు బర్న్ అవుతాయి. మీరు ఎక్కువ కేలరీలు బర్న్ చేయాలనుకుంటే HIIT తో స్క్వాట్స్‌ని యాడ్ చేయండి.

**ఆరోగ్య సమస్యలు దూరం** : నేటి కాలంలో చాలా మంది కూర్చుని జాబ్స్ చేస్తున్నారు. దీని వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే స్క్వాట్స్ చేయండి. దీనిని చేస్తే చాలా వరకూ అనారోగ్య సమస్యలు దూరమవుతాయి.

కండరాల పెరుగుదల : ఈ వర్కౌట్ చేస్తే కండరాలు పెరుగుతాయి. నేటి కాలంలో చాలా మంది కండరాలు పెంచుకోవాలని మెడిసిన్ తీసుకుంటున్నారు. దీని వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే ఖచ్చితంగా ఈ వర్కౌట్ చేయండి. స్క్వాట్స్ చేస్తే హార్మోన్స్ బ్యాలెన్స్ అయి ఇన్సులిన్ సెన్సిటివిటీని ప్రేరేపించి శరీర అభివృద్ధికి మంచిది. కాబట్టి, కండరాలు, కండరాల బలం పెంచుకోవాలనుకునే వారు ఈ వర్కౌట్ చేయొచ్చు.

# జుట్టు ఎక్కువగా ఊడిపోతోందా?



శీతాకాలం వచ్చిందంటే చాలు అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. చర్మానికి సంబంధించిన సమస్యలే కాకుండా జుట్టు సమస్యలు కూడా వస్తుంటాయి. గాలిలో తేమ పెరగడం వల్ల జుట్టు పొడిబారడమే కాకుండా చిట్లి పోతుంటుంది. అయితే కొన్ని చిట్కాలు పాటించడంవల్ల జుట్టు రాలే సమస్య నుంచి బయటపడవచ్చని చెబుతున్నారు.

హెయిర్ మాస్క్ మంచిది. మందారపువ్వు, వేప, ఉసిరి వంటి ఆయుర్వేద మూలికలతో వీటిని తయారు చేసుకోవాలి. దీన్ని తలకు పట్టిస్తే జుట్టుకు బలం. కొబ్బరి నూనెలో పొడి మూలికలను కలిపి హెయిర్ మాస్క్ వేసుకుంటే జుట్టు రాలిపోవడం తగ్గుతుంది. రాసుకునే నూనెను కూడా బాగా వేడిచేసి దాంతో మర్దనా చేసుకోవడం మంచిది. జుట్టు కుదుళ్లలో రక్త ప్రసరణ జరిగి జుట్టు ఊడిపోకుండా, చిట్లిపోకుండా చూస్తుంది. ఒత్తుగా, నల్లగా పెరుగుతుంది.

శీతాకాలం శరీరం, జుట్టు రెండింటినీ ప్రభావితం చేస్తుంది. ఖచ్చితంగా రోజు మొత్తం మంచి నీరు ఎక్కువగా తీసుకుంటుండాలి. దీని వల్ల శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. జుట్టు కుదుళ్ల పొడిబారకుండా ఉండాలంటే తగినంత నీరు తాగడం ఎంతో ప్రధానం. నీరు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరం హైడ్రేట్ అయి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దీనివల్ల జుట్టు డ్రై అవకుండా ఉండటంతో పాటు శరీరం కూడా పగలదు.

మంచి ఆహారాన్ని తీసుకుంటుండాలి. మినరల్స్, విటమిన్స్, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. దీని వల్ల జుట్టుకు మంచి పోషణ అందుతుంది. ఆహారంలో ఆకు కూరలు, పండ్లు, కూరగాయలు, గింజలు ఉండాలి. వీటిని క్రమంలో తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరం ఎంతో ఆరోగ్యవంతంగా తయారవుతుంది. దీనివల్ల ఎటువంటి వ్యాధులు శరీరం దరిదాపుల్లోకి కూడా రావు.

# నెలకు కనీసం 5కిలోల బరువైనా తగ్గాలనుందా?



చాలామంది బరువు తగ్గాలని తెగ ప్రయత్నం చేస్తూ ఉంటారు. కనీసం నెలకు 5 కిలోల బరువైనా తగ్గితే బాగుండు అని భావించేవారు ఎంతోమంది ఉంటారు. ఇక అటువంటి వారు నెలలో ఐదు కిలోల బరువు తగ్గాలంటే ఈ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరిపోతుందని చెబుతున్నారు న్యూట్రిషనిస్టులు, వ్యాయామ నిపుణులు.

నిజ జీవితంలో మనం కొన్ని సాధారణ నియమాలను పాటించడం ద్వారా బరువు తగ్గడం సాధ్యమవుతుంది. క్రమబద్ధమైన జీవితం బరువు తగ్గటానికి దోహదం చేస్తుంది. ఇక బరువు తగ్గేందుకు చెయ్యాల్సిన పనులలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది భోజనానికి అరగంట ముందు రెండు గ్లాసుల నీరు తాగాలి. ఉదయం భోజనానికి ముందు ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగాలి. మధ్యాహ్నం గాని సాయంత్రం కానీ మళ్ళీ గ్రీన్ టీ తాగితే మంచిది.

అయితే ఇందులో చక్కెర అసలు వేసుకోకూడదు. ఇక భోజనం చేసేటప్పుడు అన్నాన్ని నెమ్మదిగా నమలి తినాలి. ప్రతిరోజు పైనాపిల్ తింటే మంచిది. అయితే పరిమిత మోతాదులోనే తినాలి. ప్రతిరోజు కనీసం 30 నిమిషాల పాటు వేరే దేనిపైనా శ్రద్ధ పెట్టకుండా వేగంగా నడవాలి. కనీసం 20 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. చక్కెర పదార్థాలు, స్వీట్లు అస్సలు తినకూడదు.

చక్కెరకు బదులుగా ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉండే పదార్థాలు తినాలి. ఎనిమిది గంటల పాటు మంచి నిద్ర పోవాలి. ఇక బరువు తగ్గాలనుకునేవారు బర్గర్లు, చిప్స్, ఐస్ క్రీములు, ఫాస్ట్ ఫుడ్స్, వంటి వాటిని అస్సలు తినకూడదు. ఆహారంలో బియ్యాన్ని, తెల్లటి పిండిని, పంచదార కలిగిన పానీయాలను, అనారోగ్యకరమైన నూనెలను అస్సలు తినకూడదు.

తక్కువ కొవ్వు పదార్థాలను తీసుకోవాలి. ప్రోటీన్ లు, విటమిన్లు మరియు మాంసాహార ఆహారాలపై ఎటువంటి పరిమితి లేదు. అయినా తీసుకునే క్వాంటిటీ విషయంలో జాగ్రత్త. క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన భోజనం మీ బరువును గణనీయంగా తగ్గిస్తాయి. ఇలా ప్రతిరోజు చేస్తే నెలలో ఖచ్చితంగా 5 కిలోలు బరువు తగ్గి తీరుతారు.

# విరేచనాలు అవుతుంటే ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు!



ఒక్కొక్కసారి మనం తీసుకున్న ఆహారం సరిపడకపోతే డయేరియా బారిన పడతాం. జీర్ణ ప్రక్రియ సరిగా లేకుంటే విరేచనాలు అవుతుంటాయి. విపరీతమైన కడుపు నొప్పితో కూడిన విరేచనాలు లేదా లూజ్ మోషన్స్ చాలా అసౌకర్యంగా ఉంటాయి. మాటిమాటికి బాత్రూంకి పరిగెత్తడంతో పాటు, లూజ్ మోషన్స్ కావడం వల్ల శరీరంలో ఉన్న నీరంతా బయటకు పోయి శరీరం డీహైడ్రేట్ అవుతుంది. ఫలితంగా ఓపిక లేనట్టు, నీరసంగా ఉన్నట్టు అనిపిస్తుంది.

ఇలాంటి సమయంలో ఏదైనా ఆహారం తినాలన్నా కూడా తినలేని పరిస్థితి ఉంటుంది. ఏది తింటే ఏమవుతుందో అన్న భయం వేధిస్తుంది. విరేచనాల వల్ల కోల్పోయిన శక్తిని తిరిగి పొందటానికి, అలాగే విరేచనాలను కంట్రోల్ చెయ్యటానికి ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విరేచనాలు ఇబ్బంది పెడుతున్న సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఏం తినొచ్చు ఏం తాగొచ్చు అనేది తెలుసుకుని తదనుగుణంగా ఆహారాన్ని తీసుకోవాలని చెబుతున్నారు వైద్య నిపుణులు. విరేచనాలతో ఇబ్బంది పడుతున్నప్పుడు అరటిపండు తినడం మంచిదని, అరటిపండు తినడం వల్ల జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుందని, ఫలితంగా మోషన్ నార్మల్‌గా ఉంటుందని చెబుతున్నారు.

అరటి పండులో ఉండే పొటాషియం, ఫైబర్ కడుపులో సాధారణ స్థితికి దోహదం చేస్తాయని చెబుతున్నారు. అంతే కాదు చెక్కు తీసిన యాపిల్స్ కూడా ఈ సమస్యకు బాగా పనిచేస్తాయని, యాపిల్స్ కూడా తినొచ్చని చెబుతున్నారు. ఇక మసాలాలు, పులుపు లేని తేలికపాటి ఆహారం తినటం మంచిదని అంటున్నారు. నీటిని ఎక్కువగా తాగాలని చెప్తున్నారు.

విరేచనాలతో ఇబ్బంది పడుతున్నప్పుడు కొబ్బరి నీళ్లను తాగితే మంచిదని కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్స్ బాడీలో ఎలక్ట్రోలైట్స్‌ను బ్యాలెన్స్ చేస్తాయని, విరేచనాల వల్ల శరీరంలో పోయిన నీటి శాతాన్ని కొబ్బరినీరు పూరిస్తుంది అని చెబుతున్నారు. కొబ్బరి నీళ్ళు శరీరానికి కావాల్సిన శక్తిని కూడా ఇస్తాయని చెప్తున్నారు.

అంతేకాదు మజ్జిగ అన్నిటికంటే ఎక్కువ ప్రభావవంతంగా మన జీర్ణవ్యవస్థను దారిలోకి తెస్తుందని చెబుతున్నారు. మజ్జిగ కడుపులో కావలసిన మంచి బాక్టీరియాను పెంచి, చెడు బ్యాక్టీరియాని బయటకు పంపిస్తుందని, అయితే పుల్లటి మజ్జిగను ఈ సమయంలో తాగకూడదని, తాజాగా ఉన్న మజ్జిగ వల్ల త్వరగా విరేచనాల సమస్య నుంచి బయటపడవచ్చు అని చెబుతున్నారు.

# పిండివంటలు వండిన నూనెని ఇలా క్లీన్ చేయండి



మనం స్నాక్స్ చేసినప్పుడు గిన్నె అడుగు భాగంలో నూనె అలా ఉండిపోతుంది. దీనిని పూర్తిగా క్లీన్ చేయాలంటే కొన్ని ఈజీ టిప్స్ ఉన్నాయి. దీని వల్ల గిన్నెలో మిగిలిన నూనెని క్లీన్ చేయొచ్చు. పైగా అడుగు భాగంలోని నూనెని కూడా పూర్తిగా వాడుకోవచ్చు. అదెలానో ఇప్పుడు చూద్దాం.

**కార్న్‌ఫ్లోర్** : ముందుగా కార్న్‌ఫ్లోర్ తీసుకోండి. అందులో కొద్దిగా నీరు కలిపి బజ్జీ పిండిలా చేయాలి. దీనిని మరిగే నూనెలో వేయండి. అప్పుడు అది నూనె అడుగు భాగంలోకి వెళ్ళి పిండి తాలుకూ అవశేషాలను అతుక్కునేలా చేస్తాయి. దీంతో ఈజీగా వాటిని బయటికి తీసేస్తే పదార్థాల తాలుకూ మొత్తం అవశేషాలు వచ్చేసి నూనె క్లీన్ అవుతుంది.

**మిగిలిన నూనెలో** : అదే విధంగా ఇప్పుడు క్లీన్ అయిన నూనెని మనం తీసి వాడుకోవచ్చు. ఇప్పుడు అడుగు భాగంలోని నూనె కూడా వేస్ట్ చెయ్యొద్దనుకుంటే దానితో ఆమ్లెట్, దోశలు వేయొచ్చు. దీని వల్ల నూనె మొత్తం మనం వాడినట్లుగా అవుతుంది.

**గిన్నెని క్లీన్ చేయండి** : ఇప్పుడు ఈ గిన్నెల్ని మనం నిమ్మరసం, సబ్బుతో కలిపి క్లీన్ చేస్తే గిన్నె మొత్తం క్లీన్ అవుతుంది. జిడ్డు కూడా ఉండదు.

**ఇవి మరువొద్దు** : అయితే, ఒక్కటి గుర్తుపెట్టుకోండి. ఒకసారి వాడిన నూనెని మరోసారి ఉపయోగించకపోవడమే మంచిది. ఈ నూనెని మళ్ళీ మళ్ళీ వాడడం వల్ల ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి ఫ్రై చేసేటప్పుడే తక్కువ పరిమాణంలో ఫ్రై చేయడం, చేయాలి. ఎయిర్ ఫ్రైయర్స్ వాడండి. దీని వల్ల ఎక్కువగా నూనె వేస్ట్ అవ్వదు. నూనె పదార్థాలు ఎక్కువగా వాడడం వల్ల అధిక బరువు, కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అందుకే, వీలైనంత వరకూ ఈ ఆయిలీ ఫుడ్స్, స్నాక్స్‌కి దూరంగా ఉండడం మంచిది.



# అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆహ్వానం





అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారతదేశం సగర్వంగా హిందుత్వాన్ని చాటేలా, అత్యంత చారిత్రాత్మక కట్టడంగా నిర్మించిన 2500 సంవత్సరాల పాటు ప్రకృతి విపత్తులను తట్టుకొని నిలబడేలా నిర్మిస్తున్న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి, రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సమయం ఆసన్నం అవుతోంది. దేశవ్యాప్తంగా ప్రజలు అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి అయోధ్యకు వెళ్లాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు, ప్రత్యేక రైళ్ళు కూడా ఏర్పాటు చేసి భక్తులను అయోధ్యకు చేర్చనున్నారు. అయోధ్యలో రామయ్యకు జరిగే పట్టాభిషేకాన్ని చూడాలని ఆ మహత్కార్యాన్ని కళ్ళారా చూసి తరించాలని ప్రతి ఒక్కరు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయోధ్య రామ మందిర నిర్మాణం కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న వారందరి కోరిక తీరుతున్న సమయంలో రామయ్య తాను పుట్టిన నేలమీద తిరిగి నడయాడబోతున్నాడు.

ఇదే సమయంలో దేశ, విదేశాలలోని ప్రముఖులకు రామ మందిర ప్రారంభోత్సవ ఆహ్వానాలను పంపిస్తున్నారు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులు, విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు. ఇప్పటికే అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం మరియు శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు ఏపీ నేతలకు ఆహ్వానం అందింది. సినీ నటుడు చిరంజీవికి, మోహన్ బాబు తదితరులకు కూడా ఆహ్వానాలు అందాయి.

ఈనెల 22వ తేదీన అత్యంత వైభవోపేతంగా అయోధ్యలోని రామ మందిరంలో శ్రీ రామ్‌లల్ల విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది. విగ్రహ ప్రతిష్ఠాపనకు నిన్నటి నుండి సాంప్రదాయబద్ధమైన ముందస్తు క్రతువులు ప్రారంభమయ్యాయి. 22వ తేదీన జరగనున్న ఈ చారిత్రాత్మక ఘట్టానికి 150 దేశాల నుంచి నాలుగు వేల మంది ప్రముఖులు అతిథులుగా హాజరుకానున్నారు.

తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబుకు కూడా అయోధ్య రామాలయంలో శ్రీరామ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. అక్కడకు వెళ్ళే అతిథుల కోసం కూడా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. టెంట్ హౌస్‌లను నిర్మించి వారికి కావాల్సిన వసతి సౌకర్యం కల్పించే పనిలో ఉన్నారు.

# జగన్నాధపురం ప్రాంతంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష 2





**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం అర్బన్ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఎప్పుడూ లేని విధంగా స్పెషలిస్టు వైద్యులను గ్రామాలకు వంపి వైద్య పరీక్షలు నిర్వహించడంతో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అదే స్ఫూర్తితో ప్రస్తుతం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆరు నెలల పాటు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు అని ఈ కార్యక్రమం జూన్ నెలాఖరు వరకూ ఆరు నెలల పాటు కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు అని, దీనికి అనుగుణంగా స్పెషలిస్టు వైద్యులను, వైద్యాధికారులను నియమించారు అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. జగన్నాధపురం ప్రాంతంలో గల పాఠశాలలో బుధవారం నాడు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష 2:0 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలిపారు. జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది అని ఎమ్మెల్యే తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరాల్లో జీవనశైలి వ్యాధులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు అని రక్తపోటు, మధుమేహం, హైపోథైరాయిడ్, రక్తహీనత, గర్భకోశ వ్యాధుల వంటి వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు. అలాంటి వారిని గుర్తించి వైద్యులతో చికిత్స అందిస్తున్నారు అని అవసరమైతే మందులు ఇంటికే తీసుకుని వెళ్లి అందిస్తున్నారు అని ఎమ్మెల్యే తెలిపారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా సురక్ష కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్నారు అని ఎమ్మెల్యే తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే సమస్యలు వివరిస్తున్నారు. మొదటి విడతలో జీవనశైలి వ్యాధులున్నట్టు గుర్తించిన వారు రెండో విడత శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుంటున్నారు అని, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు గుండె, కిడ్నీ జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు వస్తే, వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు, వారు గతంలో వాడుతున్న మందులు అందించే ఏర్పాట్లు చేశారు. శిబిరంలో అందుబాటులో లేని మందులను సీడీఎస్ యాప్లో నమోదు చేసి, రోగి పేరు, చిరునామా తెలియజేస్తూ, నేరుగా పోస్టు ద్వారా వారి ఇంటికే చేరేలా ఏర్పాటు చేశారు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఖరీదైన మందులు సైతం పోస్టు ద్వారా ఇంటికే చేరుతూండటం విశేషం అని ఎమ్మెల్యే అన్నారు.జిల్లాలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం. స్పెషలిస్టు వైద్యులే గ్రామాలకు, వార్డులకు వచ్చి పరీక్షలు చేస్తూండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వారికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేస్తున్నాం. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, హైపోథైరాయిడ్ వంటి వ్యాధులున్న వారు రెగ్యులర్‌గా మందులు వాడేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులు పాల్గొంటున్నారు అని నోడల్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైద్యాధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు, స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 2 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత



దేశ రాజధానిలో చలి తీవ్రత కొనసాగుతోంది. చలిగాలులు వణికిస్తోన్నాయి. ఎముకలు కొరికేంతటి చలిని చవి చూస్తోన్నారు ఢిల్లీ వాసులు. ఇదే పరిస్థితి మరి కొద్ది రోజుల పాటు కొనసాగుతుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని సూచించింది.

కొద్ది రోజులుగా ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో ఉష్ణోగ్రత భారీగా పడిపోతూ వస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 10 నుంచి 6 డిగ్రీల వరకూ నమోదైన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇప్పుడిది తుడిచి పెట్టుకుపోయింది. సఫ్దర్ జంగ్ ఏరియాలో రెండు రోజుల కిందట డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. ఈ తెల్లవారు జామున ఇప్పుడదే ప్రాంతంలో ఉష్ణోగ్రత 1.4 డిగ్రీకి పడిపోయింది.

17 సంవత్సరాల తరువాత కనిష్ఠ ఉష్ణోగ్రత ఈ స్థాయికి పడిపోవడం ఇదే తొలిసారి. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహా సౌత్ ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో 4 నుంచి 2 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. సామాన్యులకు చలి నుంచి రక్షణ కల్పించడానికి ఢిల్లీ ప్రభుత్వం నైట్ షెల్టర్లను ఏర్పాటు చేసింది. వారికి అవసరమైన బ్లాంకెట్లు, ఇతర సదుపాయాలను కల్పిస్తోంది.

దట్టమైన పొగమంచు వీడట్లేదు. 50 మీటర్ల దూరం వరకూ ఏదీ కనిపించని విధంగా మంచుతెరలు కమ్ముకుంటోన్నాయి. దీనివల్ల విమానాల రాకపోకలకు తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. విజిబిలిటీ లోపించడం వల్ల సమయానికి అవి ల్యాండ్ కావట్లేదు. టేకాఫ్ తీసుకోవట్లేదు. ఫలితంగా ప్రయాణికులు గంటల కొద్దీ జాప్యాన్ని ఎదుర్కొంటోన్నారు. ఎయిర్ పోర్ట్‌లో పడిగాపులు పడుతున్నారు.

అటు రైళ్ల రాకపోకలపైనా తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది పొగమంచు. రైళ్లన్నీ ఆలస్యంగా నడుస్తోన్నాయి. పలు రైళ్లు రద్దవుతున్నాయి. దాదాపుగా ఉత్తరాదిలోని అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రాజస్థాన్‌లోని గంగా నగర్, పటియాలా, అంబాలా, చండీగఢ్, పాలం, బరేలీ, లక్నో, బహ్రాయిచ్, వారణాశి, ప్రయాగ్ రాజ్, తేజ్‌పూర్‌లల్లో జీరో డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# ఓటరు జాబితా 22తేదీన విడుదల



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషను జనవరి 22న విడుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జనవరి 22వ తేదీన ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. తరువాత కూడా నామినేషన్ల చివరితేది వరకు ఫారం-6 ద్వారా కొత్త ఓటర్లుగా చేరుటకు అవకాశం ఉంటుందని, వారి పేర్లను సప్లిమెంటరీ జాబితా ద్వారా విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు, అడ్రసు మార్పు, ఒకేడోరునెంబరు తదితర సమారు తొంబది అయిదు వేల సవరణలు చేసి సరిదిద్దడం జరిగిందని తెలిపారు. శుద్ధమైన ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో ప్రతి విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించుటకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా ఎన్నికల కార్యాలయం మరియు రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం లేదా రెవెన్యూ సబ్-డివిజన్ అధికారుల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్ ఏర్పాటు చేయడం జరిగిందని, మొబైల్ వ్యాన్ షెడ్యూలు ముందుగా తెలియజేయడం జరుగుతుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ప్రజలను పాల్గొనేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు మాట్లాడుతూ జనవరి 1, 2024 నాటికి ప్రతిపాదిత ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలలో మొత్తం ఓటర్లు 7,70,525 మంది కాగా వారిలో 3,76,220 మంది పురుషులు, 3,94,240 మహిళలు, 65 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై జనవరి 17వ తేదీ వరకు వచ్చిన క్లైములు, అభ్యంతరాలను పరిష్కరించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 186354 ఫారాలు స్వీకరించగా, వాటిలో 179811 ఫారాలు పరిష్కరించి ఓటరుజాబితాలో చేర్చడం జరిగిందని, 1262 ఆమోదం చేయడం జరిగిందని, 4991 తిరస్కరణకు గురయ్యాయని, 290 పరిష్కరించవలసి ఉన్నదని తెలిపారు.

ఈ సమావేశంలో బి.జె.పి. పార్టీ ప్రతినిధి పారిశర్ల అప్పారావు, టిడిపి ప్రతినిధి జి. వెంకట నాయుడు, సిపిఐ (ఎం) ప్రతినిధి రెడ్డి వేణు, బి.ఎస్.పి. పార్టీ ప్రతినిధి టి. వెంకట రమణ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సిహెచ్. సంతోష్ కుమార్, ఎస్. ఉమామహేశ్వరరావు పాల్గొని జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేసారు. ఓటరు జాబితా తయారీ ప్రకియలో ప్రతి విషయాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేయడం వలన ఓటరు జాబితా తయారీపై అనుమానాలకు అవకాశం లేకుండా పోయిందని, రాష్టంలోనే ఎటువంటి పిర్యాదులు రాని జిల్లాగా మన జిల్లా ఉందని, స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీలో కృషిచేసిన జిల్లా కలెక్టరుకు, జిల్లాయంత్రాగానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా కోడిపందాలపై దాడులు చేసిన పోలీసులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పీ కె.వి.మురళీ కృష్ణ ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది కోడి పందాలు, జూదం, మద్యం తదితర అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేశారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, వారి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, జూదం తదితరలు అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు దాడులు నిర్వహించి మొత్తం 37 కేసులు నమోదు చేశారు. వీటిలో పేకాట, బల్లాట తదితరాలపై 14 కేసులు నమోదు చేసి, 63 మంది నిందితులను అరెస్టు చేసి, రూ.26,620 నగదును మరియు కోడిపందాల పై దాడులు నిర్వహించి 23 కేసులు నమోదు చేసి, 46 మందిని అరెస్టు చేసి, 52 పందెం కోళ్లు, రూ.16,630 నగదును జిల్లా పోలీసులు స్వాధీన పరచుకున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 1 మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 47 మంది పై కేసులు నమోదు చేశారు. ప్రజలకు దిశా యాప్పట్ల అవగాహన కల్పించి. 6,02,100 మందితో యాప్‌ను డౌన్లోడ్ చేయించగా, 2,13,722 మందితో రిజిస్ట్రేషన్ చేయించారు.

జిల్లా పోలీసులు, సెబ్ అధికారులు దాడి చేసి, 13 కేసులు నమోదు చేసి, 13 మంది నిందితులను అదుపులోనికి తీసుకుని, 20 లీటర్ల అక్రమ మద్యం, 4 లీటర్ల నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# ఉద్యమ నేత బాలకృష్ణ చిరస్మరణీయులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమ నేత కామ్రేడ్ అంగులూరి బాలకృష్ణ సంస్మరణ సభలో తేదేపా యువ నాయకులు దాడి రత్నాకర్ పాల్గొని, బాలకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్ మాట్లాడుతూ బాలకృష్ణ సేవలు చిరస్మరణీయమని, నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఉద్యమ నేత అని అన్నారు. ఈ సందర్భంగా ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ గతంలో రైతు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల ఉద్యమంలో కలిసి పనిచేయడం జరిగిందని అదే కాకుండా ఎన్టీఆర్ ఆస్పత్రి కార్మికుల సమస్యల గురించి , ప్రాంతంతో సంబంధం లేకుండా ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ఆయనదని అన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి తన వంతు సహాయంగా ప్రజలకు కూరగాయలు, నిత్యవసరాలు పంచిన ధైర్యశాలి అన్నారు. త్వరలోనే ఆయన గుర్తుగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇంటి వద్దకే ఉచితంగా ఆధునిక వైద్య సేవలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పేదల ఇళ్లకు సమీపంలో ఉన్న సచివాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకే వైద్యనిపులు వచ్చి అత్యంత ఆధునిక ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కు తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పేర్కొన్నారు. అనకాపల్లి 82వ వార్డు విజయ రామరాజు పేట సచివాలయంలో జోనల్ కమిషనర్ వెంకట రమణతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా, ఎన్నడూ లేని విధంగా పేద, మధ్యతరగతి వారికి ఉచితంగా సమీపంలోకి వచ్చి అందజేస్తున్న వైద్య సేవలను అవసరం అయిన వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ, శ్రీ నూకాంబిక దేవస్థానం డైరెక్టర్ ఆడారి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ మునూరు శ్రీనివాసరావు, యువజన విభాగం పట్టణ శాఖ అధ్యక్షులు వేగి త్రినాథ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్డి హరిబాబు, పాలమరశెట్టి మోహన్, చవితిన నూకరాజు, చింతా రాంజీ, పెంటకోట శ్రీనివాసరావు, ఏపిడి దొర, వీధి విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతి చెందిన వ్యాన్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన సంఘ సభ్యులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ గ్రూప్ విశాఖ జిల్లా అచ్యుతాపురం వ్యాన్ డ్రైవర్ అయిన బాబ్జి కుటుంబ సభ్యులకు 60 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. గత ఆదివారం బాబ్జి అకాల మరణం చెందారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. తోటి వ్యాన్ డ్రైవర్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని తమ వంతు ఆదుకోవాలనే దృక్పథంతో వ్యాన్ డ్రైవర్లందరూ తమ సంఘం తరఫున ఈ ఆర్థిక సాయం అందజేసారు. గ్రూపు అడ్మిన్స్ అయినటువంటి కొయ్యల గూడెం సత్యనారాయణ, ముమ్మిడివరం త్రిమూర్తులు, అన్నవరం కొండబాబు, నర్సీపట్నం అశోక్, అనకాపల్లి ప్రసాద్, అచ్యుతాపురం శీను, అచ్చుతాపురం స్టాండ్ ప్రెసిడెంట్ వర బాబు, స్టాండ్ సభ్యులు, పాత గాజువాక ప్రసాద్, ఆధ్వర్యంలో ఈ మొత్తాన్ని సేకరించి బాబ్జి కుటుంబానికి అందజేశారు.

## రాజీవ్ క్రీడా మైదానం నుండి నేడు మారథాన్



**విజయనగరం:** సామాజిక సమతా సంకల్ప మహోత్సవాలలో భాగంగా నేడు మారథాన్ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ మారథాన్ గురువారం ఉదయం 7.30 గంటలకు రాజీవ్ క్రీడా మైదానంలో మొదలై కోట, సింహాచలం మేడ, గంటస్తంభం మీదుగా రాజీవ్ క్రీడా మైదానం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం గావించాలని కలెక్టర్ కోరారు.

## గుర్రపు పందాలు ప్రారంభించిన భరత్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని మాటూరు గ్రామంలో శ్రీ సీతారాముల తీర్థం మహోత్సవం సందర్భంగా గుర్రం పందాలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైకాపా అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పాల్గొని ముందుగా జండా ఊపి గుర్రం పందాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు కరణం నాగేశ్వరావు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాల విజయానికి హృదయపూర్వక అభినందనలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా మన సుసంపన్నమైన గ్రామ సంస్కృతి, సంప్రదాయం మరియు ఆధ్యాత్మికతను చాటి చెప్పడమే కాకుండా అపారమైన ఆనందం, వినోదం మరియు వినోదాన్ని అందించింది.

ఈ మెగా ఈవెంట్‌లో టీమ్ జివిఎల్‌లో భాగమయ్యే అవకాశం ఇచ్చినందుకు నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మీ సత్సంకల్పానికి ప్లానింగ్ మరియు ఎగ్జిక్యూషన్‌లలో జట్టును నిమగ్నం చేసి ఉండటం వల్ల ఈ వేడుక విజయవంతానికి సహకరించగలిగాము. మరియు నేను ఎంతో అభిమానించే ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా నా ఉడుతాభక్తితో చిరు అనుభవాన్ని అందించగలిగినందులకు సంతోషిస్తున్నాను.

మీ నాయకత్వం మరియు టీమ్ జీవీఎల్ యొక్క అంకితభావం నిస్సందేహంగా మన సాంప్రదాయ హిందూ సమాజంపై శాశ్వత ప్రభావాన్ని చూపాయి. మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో నిజమైన నిబద్ధతను ప్రతిబింబిస్తూ ఈవెంట్‌లోని ప్రతి అంశంలోనూ ఉత్సాహం మరియు వివరాల పట్ల నిశిత దృష్టి, శ్రద్ధ స్పష్టంగా కనిపించింది.

విశాఖపట్నం ప్రజలు ఇప్పుడు ప్రతి హిందువుల పండుగకు ఇలాంటి వేడుకలు మరిన్ని జరగాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు, జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాలు అద్భుతమైన విజయాన్ని సాధించాయనడంలో అతిశయోక్తి లేదు.

మరోసారి, నాకు కల్పించిన అవకాశానికి ధన్యవాదాలు మరియు మన సాంస్కృతిక గుర్తింపును ప్రోత్సహించడంలో మరియు రక్షించడంలో మీ అవిశ్రాంత ప్రయత్నాలకు ధన్యవాదాలు.

శుభాకాంక్షలతో, **లయన్ బగ్గం శ్రీనివాసరావు.**

అధ్యక్షుడు, స్మార్ట్ విశాఖ కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ. ఉపాధ్యక్షుడు AP శిష్ట కరణమ్స్ అసోసియేషన్.

# ఘనంగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కారాల ప్రదానోత్సవం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ అనకాపల్లి వారి ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా వలే ఈ ఏడాది కూడా వివిధ సేవలు అదిస్తున్న వ్యక్తులకు అవార్డులను అందజేశారు. స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం, ఉప్పల చంద్రశేఖర్, కళ్యాణ మండపంలో ముఖ్య అతిధి పద్మభూషణ్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్ 2024 అవార్డులను అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించి అందజేశారు. ఈ సందర్భంగా పద్మభూషణ్ డాక్టర్ వై. లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ రామలింగస్వామి వ్యవసాయ శాస్త్రవేత్తగా రైతులు అభ్యున్నతి కొరకు విశేష కృషి చేసిన రైతు బాంధవునిగా అభివర్ణించారు. తండ్రి పేరిట స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌ను అభినందించారు అలాగే సేవా కార్యక్రమాల ద్వారా మంచిని ప్రోత్సహిస్తూ అందరిలోను ప్రేరణ కల్పిస్తున్న డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ అభినందనీయం, సంక్రాంతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు అయిన భారతదేశం వారసత్వాన్ని గౌరవాన్ని మరింత పెంపొందించేందుకు యువత కృషి చేయాలన్నారు. సంఘ సేవా రంగం నుండి చిలకూరి శ్రీనివాసరావు (కడియం), మార్గం రాజేష్, పి.తిరుపతిరావు పట్నాయక్ (అచ్యుతాపురం), రాపర్తి జగదీష్ కుమార్ (విజయనగరం), సుమరకాస రవితేజ (విశాఖపట్నం), విల్లూరి భారవ్ (విద్యారి రంగం). జీరెడి తరుణ్కుమార్ (సదా పాండేషన్). ఏడుగురికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ కొణతాల లక్ష్మీపార్వతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు, విశ్రాంత ఉపాధ్యాయులు కాంద్రేగుల సత్యనారాయణ, కాంద్రేగుల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 19న జిల్లాలో జన్ భగీధరి కార్యక్రమం




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో జన్ భగీధరి కార్యక్రమం ఈ నెల 19వ తేదిన నిర్వహించడం జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవింద రావు అన్నారు. జన్ భగీదరి కార్యక్రమంపై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 19వ తేదీన విజయవాడలో 125 అడుగుల ఎత్తు గల విగ్రహావిష్కరణ జరుగుతుందని అందులో భాగంగా జన్ భగీదరి కార్యక్రమంను జిల్లాలో 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19వ తేదీ ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు మారథాన్ జరుగు తుందని, అనంతరం మానవహారం ఉంటుందని అన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని యువత పెద్ద ఎత్తున రక్త దానంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటల నుండి ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరం ప్రాంగణంలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఛాయా చిత్ర ప్రదర్శన, సిగ్నేచర్ కాంపెయిన్, సభ జరుగుతుందని ఆయన వివరించారు. గ్రామ వార్డు సచివాలయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. సామాజిక న్యాయం అవగాహన కార్యక్రమం భారీ ఎత్తున చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి. గయాజుద్దీన్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ వెంకటేశ్వర రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా ప్రజా రవాణా అధికారి టివిఎస్ సుధాకర్, మునిసిపల్ కమీషనర్ జె రామ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభవన్ వద్ద కారు ప్రమాదం.. మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై కేసు



హైదరాబాద్: తెలంగాణ ప్రజాభవన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో మాజీ ఎమ్మెల్యే షకీల్‌పైనా కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసులు ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. షకీల్ కుమారుడు సాహిల్ గత నెల కారును వేగంగా నడుపుతూ ప్రజాభవన్ ఎదుట ట్రాఫిక్ బారికేడ్లను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ కేసు నుంచి కుమారుడిని తప్పించేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రయత్నించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కేసు నుంచి సాహిల్‌ను తప్పించేందుకు ప్రయత్నించిన సీఐ దుర్గారావును సస్పెండ్ చేశారు. ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌కు నోటీసులు జారీ చేశారు. సీఐని మభ్యపెట్టినందుకు షకీల్‌తో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఘటనలో మొత్తం 10మందిపై కేసులు నమోదు చేయగా, ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసినట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత సాహిల్ దుబాయ్ పారిపోయాడు. దీంతో పోలీసులు లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. అప్పటికే దుబాయ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే షకీల్.. తన కుమారుడిని దుబాయ్‌కి పిలిపించుకున్నాడు. తాజాగా షకీల్‌తో పాటు మరో ఇద్దరిపైనా లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు.

# కెనడాకు వెళ్లే భారత్ విద్యార్థుల్లో భారీ తగ్గుదల..!




ప్రస్తుతం కెనడాలో నెలకొన్న పరిస్థితులతోపాటు.. భారత్ తో ఏర్పడిన దౌత్యపరమైన విభేదాలు చర్చనీయాంశం అయిన సంగతి తెలిసిందే. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు ఇండియన్ ఏజెంట్లే కారణమంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన నిరాధార ఆరోపణలు రెండు దేశాల మధ్య తీవ్ర విభేదాలను రాజేశాయి. దీంతో ఈ వ్యవహారం చినికి చినికి గాలివానగా మారింది.

దీంతో దేశరాజధాని ఢిల్లీలోని తమ రాయబారులను భారీ సంఖ్యలో తగ్గించుకోవాలని భారత ప్రభుత్వం సూచించింది. దీంతో కెనడా 41 మంది దౌత్యాధికారులను వెనక్కి తీసుకుంది. ఈ నేపథ్యంలో స్టడీ పర్మిట్లను ఎక్కువమొత్తంలో ప్రాసెస్ చేయడం కుదరలేదని ఆ దేశ ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇదే సమయంలో సమీప భవిష్యత్తులో పెరిగే సంకేతాలు కూడా కనిపించడం లేదని పేర్కొన్నారు.

ఫలితంగా... భారతీయ విద్యార్థులకు ఇచ్చే స్టడీ పర్మిట్ల సంఖ్యను కెనడా ప్రభుత్వం గణనీయంగా తగ్గించింది. ఈ క్రమంలో... గత ఏడాది డిసెంబర్ తో ముగిసిన త్రైమాసికంలో కేవలం 14,910 పర్మిట్లను మాత్రమే జారీ చేసింది. అంతకుముందు మూడు నెలల వ్యవధిలో ఈ సంఖ్య 1,08,940గా ఉండటం గమనార్హం. అంటే... పర్మిట్లలో సుమారు 86 శాతం తగ్గుదల నమోదైందన్నమాట.

కాగా... కెనడాలో చదువుకోవడానికి వెళ్లే విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అత్యధికం అనే సంగతి తెలిసిందే. ఈ క్రమంలో... 2022లో కెనడా ప్రభుత్వం 2,25,835 స్టడీ పర్మిట్లను జారీ చేయగా.. అందులో సుమారు 41 శాతం భారతీయ విద్యార్థులే సొంతం చేసుకున్నారు. మరోవైపు విదేశీ విద్యార్థుల వలసలు పెరగడంతో కెనడాలో నిరుద్యోగం, ఇళ్ల కొరత సమస్యలు తలెత్తుతున్నాయని ఇటీవల మార్క్ మిల్లర్ వెల్లడించారు.

## అమర్‌ది పవన్‌ను విమర్శించే శాఖ: పీతల మూర్తియాదవ్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను తిట్టినా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు సీఎం జగన్ సీట్ ఇవ్వలేదని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఎద్దేవా చేశారు. అందుకే ఇప్పుడు చంద్రబాబుని తిట్టడం మొదలుపెట్టారని చెప్పారు. సీటు రాకపోతే నారా లోకేశ్‌ను, దేవాన్ష్‌ను కూడా తిడతారేమోనని వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"మంత్రి అమర్‌నాథ్‌ది పేరుకే పరిశ్రమల శాఖ. కానీ ఆయనకు పవన్‌ను విమర్శించే శాఖ ఇచ్చారు. 11 కేసుల్లో ఏ1గా ఉన్న జగన్ కోర్టుకు వెళ్లడం లేదు? బెయిల్‌పై బయట ఉంటూ తన బాబాయి హత్యలో కీలకపాత్ర పోషించారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ ఉన్న పార్టీ వైకాపా. కోడికత్తి కేసులో నిందితుడిగా ఉన్న శ్రీను ఐదేళ్ల నుంచి జైల్లో మగ్గిపోతున్నాడు. ఈ కేసులో సాక్షిగా ఉన్న జగన్ కోర్టుకు వెళ్లాలని అమర్ డిమాండ్ చేయాలి. ముందు ఆ డిమాండ్ చేసి చంద్రబాబు గురించి మాట్లాడాలి. 125 అడుగులు అంబేడ్కర్ విగ్రహం పెడుతున్నామని గొప్పలు చెబుతున్నారు. ఒక దళిత బిడ్డ కోసం పది నిమిషాలు కేటాయించని సీఎం కోసం అమర్ మాట్లాడటం దారుణం. ఎక్కడ పోటీ చేసినా ఆయన ఓటమికి ప్రతి జనసైనికుడూ పనిచేస్తారు" అని మూర్తియాదవ్ అన్నారు.

## అమరావతిలో 19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన విశ్వజ్ఞాని, భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మీడియా ద్వారా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని, విజయవంతం చేసేందుకు చాలా శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే క్రమంలో రాష్ట్ర పర్యటన చేస్తూ జిల్లాకు రావడం జరిగిందన్నారు.

విజయవాడలో డా॥ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహా విష్కరణ కార్యక్రమ నిర్వహణపై సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బుధవారం ఉదయం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలోని 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించ నున్నట్లు చెప్పారు. ఇందులో ధ్యాన మందిరం, 10 వేల పుస్తకాలతో గ్రంథాలయం, పచ్చదనం, ఫౌంటైన్స్ తదితర వసతులతో చారిత్రాత్మక కట్టడంగా రూపొందించడం జరిగిందని అన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రతత్వం, సమన్యాయాన్ని కల్పించిన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అద్భుతమైన భారత రాజ్యాంగాన్ని రచించి మనకందించి, భిన్నత్వంలో ఏకత్వం అని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి అని ప్రసంశించారు. దేశ ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా, మనిషిని మనిషిగా గౌరవించేలా చేసేందుకు అంబేద్కర్ చేసిన కృషి, త్యాగం అనిర్వచనీయమని పేర్కొన్నారు. ఆయనను ప్రపంచ దేశాలు కూడా గుర్తించాయని, 142 దేశాల సభ్యత్వం ఉన్న యునైటెడ్ నేషన్స్ అంబేద్కర్ పుట్టినరోజు అయిన ఏప్రిల్ 14న ఇంటర్నేషనల్ నాలెడ్జ్ డేగా ప్రకటించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. అలాగే కొలంబియా యూనివర్సిటీ ఈ శతాబ్దపు మహోన్నత వ్యక్తులలో ప్రథమ స్థానాన్ని అంబేద్కర్‌కు అందించిన సంగతిని వివరించారు. అమెరికాతో పాటు కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో కూడా అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పారని స్పష్టం చేశారు. అంబేద్కర్ రచించిన పుస్తకం ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు ఇప్పటికీ జరుగుతున్నాయని వివరించారు. అటువంటి మహనీయుని అందరికీ పరిచయం చేయడం, అందరివాడని చాటి చెప్పేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా జనవరి 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించ నున్నట్లు ఆయన తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న కార్యక్రమమిదని ఆయన తేల్చిచెప్పారు. ఇటువంటి మహత్తర కార్యక్రమానికి లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

### పోలీస్ వ్యవస్థని జగన్ భ్రష్టు పట్టించారు: యరపతినేని శ్రీనివాసరావు

చంద్రబాబు హయాంలో అభివృద్ధికి చిరునామాగా ఉన్న ఏపీని సీఎం జగన్ సర్వనాశం చేశారని టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. వ్యవసాయరంగం నిర్వీర్యమయిందని... పంటలు నష్టపోయి రైతులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను జగన్ ఏనాడూ పరామర్శించలేదని దుయ్యబట్టారు. పోలీసు వ్యవస్థని భ్రష్టు పట్టించారని, పోలీస్ డిపార్ట్ మెంట్ కు చెడ్డ పేరు తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్యంపై జగన్ కు నమ్మకం లేదని... రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.

ప్రజా సంక్షేమం ఏ మాత్రం పట్టని వ్యక్తి జగన్ అని యరపతినేని విమర్శించారు. తనపై సాక్షి తప్పుడు వార్తలు రాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ను ఇంటికి పంపించేందుకు ఐదు కోట్ల మంది ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించబోతోందని చెప్పారు.

# అప్పన్న ఆలయంలో వైభవంగా గజేంద్ర మోక్షం ఉత్సవం



దేవుడి పై భక్తి, విశ్వాసం ఉన్నవాళ్లకు దైవ కార్యాలలో జరిగే కొన్ని ఘటనలు అమితాశ్చర్యాన్ని, అంతులేని ఆనందాన్ని కలిగిస్తాయి. ఇందుకు తాజా ఉదాహరణ ఇది. కనుమ పండుగ సందర్భంగా సింహాచలం లోని శ్రీశ్రీశ్రీ వరహాలక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం లో అత్యంత వైభవంగా జరిగిన స్వామివారి మకర వేట లో నిర్వహించిన గజేంద్ర మోక్షం లో తారా జువ్వల ఎపిసోడ్ భక్తులందరినీ కట్టిపడేసింది. ఈ ఉత్సవంలో భాగంగా కాల్చిన తారాజువ్వలు మూడు సార్లు కూడా ముందుకు వెళ్లి వెనక్కి రావడంతో భక్తులంతా కేరింతలు కొడుతూ నిశ్చేష్టులై, ఆనంద పారవశ్యంతో అలానే నిలుచుని మంత్ర ముగ్ధులై నిలుచుని స్థాణువులా ఉండిపోయారు. అలా తారాజువ్వలు ముందుకు వెళ్ళి వెనక్కు వస్తే పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని రైతాంగ ప్రగాఢ విశ్వాసం. ఉత్సవం పూర్తి కాగానే తిరిగి స్వామిని గ్రామము లో ఉన్న పుష్కరణి సత్రంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

**ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం గజేంద్ర మోక్షం**

శ్రీ వరహాలక్ష్మి దేవస్థానం సన్నిధిలో జరిగే ఉత్సవాల్లో ఒకటైన గజేంద్రమోక్షం కనుమ పండుగ రోజున జరుగుతుంది. అంటే మకర వేట కోసం స్వామివారు కొండ పైన బయలుదేరి మెట్ల మార్గం ద్వారా తొలి పవంచా వద్ద నుండి పైడితల్లి అమ్మవారి గుడి వరకు, అక్కడ నుండి స్వామి వారి పూల తోటకు నాదస్వర వేద మంత్రాలతో పూల తోటకు వేంచేసి అక్కడ అధిష్టింపజేసి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఆరాధన విశేషా ఆరాధన. మంగళ నిరంజన్ కార్యక్రమం తీర్థ ప్రసాదాలు వినియోగం జరిగిన తర్వాత భాగవతంలో ఉన్నటువంటి గజేంద్ర మోక్షం ఘట్టం పారాయణం జరిగింది. ఈ కార్యక్రమం లో భగవంతుడు చాలా వాత్సల్యం కలిగినటువంటి వాడు గా దర్శనమిస్తారు. అటువంటి ఆయన వారిని వీరిని కాకుండా నోరులేని జంతువులను కూడా రక్షించేటువంటి స్వభావం దయా గుణం కలిగినటువంటి వాడుగా, జంతువు అయినటువంటి గజేంద్రుని కూడా రక్షించే దయార్ధ గుణం కలిగిన వాడు గా గోచరిస్తాడు. భగవంతుడు అనే సత్యాన్ని లోకానికి తెలియడం కోసం ఈ ఉత్సవం జరుగుతుంది అని ఆలయ స్థానాచార్యులు డాక్టర్ రాజ గోపాల్ చెప్పారు. ఈ దృశ్యాలు కన్నుల పండుగగా, ఈ తతంగం అంతా వీనుల విందుగా సాగింది.

# విజయవాడ కేంద్రంగా సామాజిక సమతా సంకల్ప సభ



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల ఎత్తయిన కాంస్య విగ్రహావిష్కరణ గడువు సమీపిస్తోంది. ఇంకో రెండు రోజులే మిగిలివుంది. ఈ నెల 19వ తేదీన సాయంత్రం 4 గంటలకు నిర్వహించబోయే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించడానికి ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.

విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఇదివరకే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వీ విజయసాయిరెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురాం, విజయవాడకు చెందిన పార్టీ సీనియర్ నేతలు, అధికారులు పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణతో పాటు స్మృతివనాన్నీ ప్రారంభిస్తారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.

ఈ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి సుమారు లక్షమంది హాజరు కానున్నారు. భారీగా స్వరాజ్ మైదానానికి తరలివచ్చే వారి కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేస్తోన్నారు అధికారులు. బారికేడ్లను ఏర్పాటు చేస్తోన్నారు. దాదాపుగా అన్ని జంక్షన్లలోనూ భారీ ఎల్ఈడీ స్క్రీన్లను అమర్చుతున్నారు.

సుమారు 400 కోట్ల రూపాయల వ్యయంతో స్వరాజ్ మైదాన్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించింది ఏపీ ప్రభుత్వం. సామాజిక న్యాయ మహాశిల్పంగా నామకరణం చేసింది. 19 ఎకరాల్లో స్మృతివనాన్ని ఏర్పాటు చేసింది. అంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలతో కూడిన ఫొటో గ్యాలరీ, కన్వెన్షన్ సెంటర్‌ను ఇందులోనే నిర్మించింది. ఈ కార్యక్రమం పోస్టర్‌ను మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీలు నందిగాం సురేష్, వీ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సామాజిక సమతా సంకల్ప సభగా పేరు పెట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

# 68వ రైల్వే వీక్ అవార్డ్సులో డీఆర్ఎం బెస్ట్ ఎఫిషియెన్సీ షీల్డ్‌ని అందుకుంది




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈస్ట్ కోస్ట్ రైల్వే బుధవారం భువనేశ్వర్‌లో 68వ రైల్వే వీక్ అవార్డు కార్యక్రమాన్ని జరుపుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ మనోజ్ శర్మ నుండి డిఆర్ఎం సురభ్ ప్రసాద్ నేతృత్వంలోని టీమ్ వాల్టెయిర్ 5 సమర్థతా షీల్డ్‌లను అందుకుంది.

రైల్వే పురుషులు & వారి కుటుంబ సభ్యులను ఉద్దేశించి, మనోజ్ శర్మ, 2022-23లో అత్యధిక లోడింగ్ జోన్‌గా గౌరవాన్ని సాధించడంలో మరియు భారతీయ రైల్వేలో చరిత్ర సృష్టించేందుకు అనేక మైలురాళ్లను అధిగమించడంలో దోహదపడిన రైల్వే పురుషులు వారి నిర్విరామ ప్రయత్నాలకు మరియు వారి విధుల పట్ల అంకితభావానికి అభినందనలు తెలిపారు. మరియు ఆత్మను కొనసాగించడం అత్యుత్తమ పనితీరు కనబరిచిన మండలంలోని 35 మంది ఉద్యోగులు, 2 గ్రూపులు, 3 అధికారులకు మెరిట్ అవార్డులు, షీల్డ్‌లను అందజేశారు. వాల్టెయిర్ డివిజన్ 2023లో 'బెస్ట్ క్లీన్ స్టేషన్ (మేజర్ స్టేషన్ కేటగిరీ) షీల్డ్', ఎలక్ట్రికల్, సిగ్నల్ & టెలికాం, ఖుర్దా రోడ్‌తో ఆపరేటింగ్ మరియు సర్వే & కన్‌స్ట్రక్షన్‌లో షీల్డ్‌తో సహా వివిధ రంగాలలో పనితీరు కోసం 5 సమర్థతా షీల్డ్‌లను అందుకుంది. డివిజనల్ రైల్వే మేనేజర్, వాల్టెయిర్ శ్రీ సౌరభ్ ప్రసాద్ ఆయా శాఖల అధికారులతో కలిసి షీల్డ్‌లను అందుకున్నారు.

డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, రైల్వే అభివృద్ధికి తమ విలువైన సహకారం అందించినందుకుగానూ సమర్థతా షీల్డ్‌లను పొందిన అవార్డు గ్రహీతలు మరియు విభాగాలందరినీ అభినందించారు మరియు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలను సాధించేందుకు స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు.

# టెస్టు మ్యాచ్ కోసం జోరుగా ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

## 26వ తేదీ నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయం
## ఆందోళన వద్దు అందుబాటులో అన్ని రకాల టికెట్లు
## ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు విశాఖపట్నం వేదికగా జరగనున్న భారత్ ౹ ఇంగ్లండ్ జట్ల మధ్య 2వ అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ కోసం అన్ని రకాల టిక్కెట్లు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయంపై బుధవారం ఒక పత్రికలో తప్పుడు వివరాలతో ప్రచురితమైన వార్తను ఖండిస్తున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ టికెట్లు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించినట్లు వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో రెండు రోజుల్లో 3 వేల టికెట్ల విక్రయం..

పేటీఎం యాప్ లేదా insider.in అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రెండు రోజుల్లోనే (15, 16 తేదీల్లో) 3 వేల టికెట్లు విక్రయించాము. ఆన్‌లైన్‌లో ఒక రోజు మ్యాచ్ కోసం రూ. 100, రూ. 200, రూ. 300, రూ. 500 విలువ చేసే టిక్కెట్లు, అదేవిధంగా సీజన్ మొత్తానికి (5 రోజులకు కలిపి) రూ. 400, రూ. 800, రూ.1,000 విలువ చేసే టికెట్లు అందుబాటులో ఉన్నాయి. రూ. 1,500 టికెట్లు ఆన్‌లైన్‌లో అయిపోయినప్పటికీ ఆఫ్‌లైన్ ద్వారా విక్రయించే కౌంటర్లలో కొనుగోలు చేయొచ్చని తెలిపారు.

ఆప్షన్ ఎంచుకోవాలి..

ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసేవారు insider.in అనే వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే అందులో సీజన్ పాస్, 'డే' (రోజు వారీ) టికెట్లకు సంబంధించి రెండు ఆప్షన్లు కన్పిస్తాయి. సీజన్ టికెట్లు కావాలనుకునేవారు సీజన్ పాస్ ఆప్షన్, రోజు వారీ టికెట్ల కోసం 'డే' ఆప్షన్‌ను ఎంచుకోవాలని సూచించారు.

26వ తేదీ నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు..

టెస్టు మ్యాచ్ కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి టికెట్లు విక్రయాలు ప్రారంభించామని, ఆఫ్‌లైన్ ద్వారా ఈ నెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం, 26 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లు అందుబాటులో ఉంటాయని ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు.

విక్రయించేందుకు అందుబాటులో ఉంచిన టికెట్ల వివరాలు..

విక్రయించేందుకు 13,382 టికెట్లు అందుబాటులో ఉంచాము.

ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు ఉంచిన ధరల వివరాలు టికెట్లు

రోజుకు రూ.100సీజన్‌కు రూ.400 2,000

రోజుకు రూ.200సీజన్‌కు రూ.800 1,000

రోజుకు రూ.300సీజన్‌కు రూ.1,000 2,500

రోజుకు రూ.500సీజన్‌కు రూ.1,500 400

**మొత్తం 5,900**

ఆఫ్‌లైన్‌లో విక్రయించేందుకు కేటాయించిన ధరల వివరాలు టికెట్లు

రోజుకు రూ.100సీజన్‌కు రూ.400 2,092

రోజుకు రూ.200సీజన్‌కు రూ.800 330

రోజుకు రూ.300సీజన్‌కు రూ.1,000 1,903

రోజుకు రూ.500సీజన్‌కు రూ.1,500 309

**మొత్తం 4,632**

రాష్ట్రంలోని క్రికెట్ క్లబ్ క్రీడాకారుల కోసం (రాయితీపై) 2,850 టికెట్లు

10 వేల మంది విద్యార్థులకు ఉచితంగా ఎంట్రీ..

రోజుకు రెండు వేల మంది చొప్పున ఐదు రోజులకు 10,000 మంది విద్యార్థులకు ఉచిత ఎంట్రీ ఇస్తాము. అయితే విద్యార్థులు ఐడీ కార్డులు తప్పనిసరిగా తీసుకరావాలి.

క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు రాయితీపై టికెట్లు..

రాష్ట్రంలోని 2,850 మంది క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు రాయితీపై రూ. 250లకు ఐదు రోజుల పాటు మ్యాచ్‌ను తిలకించే అవకాశం కల్పించాము.

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా లోయర్ పెవిలియన్ సీజన్ టికెట్లను విశాఖపట్నంలో కేవలం రూ. 1500లకు అందుబాటులో ఉంచినట్లు ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

# సీఎం జగన్ నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డికి పిలుపు



బాలినేని శ్రీనివాసరెడ్డికి సీఎం వైఎస్ జగన్ నుంచి పిలుపు వచ్చింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చి తనను కలవాలని బాలినేని శ్రీనివాసరెడ్డిని సీఎం ఆదేశించారు. బాలినేనికి బుధవారం అపాయింట్మెంట్ ఇవ్వడంతో సీఎంవోకి వచ్చారు. సీఎం జగన్ తీరుతో కొంత కాలంగా బాలినేని శ్రీనివాసరెడ్డి అసంతృప్తితో ఉన్నారు. ప్రకాశం జిల్లాలో పలు నియోజకవర్గాల ఇన్‌చార్జిల మార్పులపై ఆగ్రహంతో ఉన్నారు. తనతో కనీసం చర్చించకుండా మార్పులు చేస్తుండటంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గిద్దలూరు, దర్శి, కొండేపి అసెంబ్లీ ఇన్‌చార్జిల నియామకంలో తన మాట పట్టించుకోలేదని బాలినేని అసంతృప్తితో ఉన్నారు.

బాలినేని అలక అందుకోసమేనా..

ఒంగోలు ఎంపీ సీటు మాగుంట శ్రీనివాసులురెడ్డికి ఇవ్వాలని బాలినేని పట్టుబడుతోన్నారు. తన నియోజకవర్గం ఒంగోలులో పేదల ఇళ్ల స్థలాల పంపిణీ కోసం నిధులు కేటాయించకపోవడంపైనా ఆయన అలక బూనినట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా సీఎం జగన్‌ని కలిసేందుకు అవకాశం ఇవ్వక పోవడంతో బాలినేని అసంతృప్తిలో ఉన్నారు. కొద్ది రోజులుగా ఆయన ఎవరికీ అందుబాటులోకి లేకుండా ఉన్నారు. ప్రకాశం జిల్లాలో జరిగిన పలు కీలక సమావేశాలకూ కూడా బాలినేని, ఆయన అనుచరులు గైర్హాజరవుతున్నారు. సీఎంవో సహా ముఖ్యనేతల సంప్రదింపులతో బాలినేని తాడేపల్లికి వచ్చారు. బాలినేనితో సీఎం కార్యదర్శి ధనుంజయ రెడ్డి, ముఖ్యనేతలు చర్చిస్తున్నారు. కాసేపట్లో సీఎం జగన్‌ను బాలినేని శ్రీనివాసరెడ్డి కలిసి చర్చించే అవకాశాలు ఉన్నాయి.


Sugar Free Fitearly | నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | थकावट से सत्वर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ఠ వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి

ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179

ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED® HEALTH AND HAPPINESS

Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు



**విజయనగరం:** ప్రస్తుత ఖరీఫ్ సీజనులో జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు లోను కాకుండా తాము పండించిన ధాన్యం విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యంకు వెనువెంటనే చెల్లింపులు చేయడం, వారికి మంచి గిట్టుబాటు ధర లభించడంతో వారంతా సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకున్నారని మంత్రి పేర్కొన్నారు. దీనితోపాటు ప్రభుత్వ పథకాలు వారికి అందడంతో ఆనందంగా సంక్రాంతిని తమ కుటుంబాలతో జరుపుకున్నట్టు చెప్పారు. ఖరీఫ్ సీజనులో ధాన్యం సేకరణ ప్రక్రియ జరుగుతున్న తీరుపై మంత్రి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పౌరసరఫరాల సంస్థ డి.ఎం. మీనాకుమారి, డి.ఎస్.ఓ. మదుసూధన్, వ్యవసాయశాఖ జె.డి. వి.టి.రామారావు, డి.సి.ఓ. రమేష్, మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును కలెక్టర్, జె.సి.లు మంత్రికి వివరించారు. రైస్ మిల్లర్లు తమ సమస్యలపై మంత్రికి వివరించగా ఆయా అంశాలపైన మంత్రి అధికారులతో సమీక్షించారు. ఏదైనా మండలం నుంచి వచ్చిన ధాన్యం అక్కడ మిల్లులకు కేటాయించగా మిగిలిన తర్వాతే ఇతర మండలాలకు తరలించాలని ఆదేశించారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 3.40 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి గాను ఇప్పటివరకు 2.67 లక్షల టన్నులు రైతుల నుంచి సేకరించడం జరిగిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి గాను రూ.400 కోట్లు వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ చేపట్టిన ఇ- క్రాప్ నమోదు ఆధారంగా వరి పంట దిగుబడిని అంచనా వేసి స్థానిక వినియోగానికి పోను 3.40 లక్షల టన్నులు మార్కెట్‌కు వస్తుందని జిల్లా అధికారులు అంచనా వేసినట్టు మంత్రి వెల్లడించారు. ఈ మేరకు లక్ష్యాన్ని నిర్ణయించుకొని ధాన్యం సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో నిర్ణయించిన లక్ష్యం మేరకు మరో 82 వేల టన్నులు సేకరణ చేయాల్సి వుందని, దీనిని కూడా త్వరగా చేపట్టేలా ఆదేశాలిచ్చామన్నారు. రాజాం, ఎస్.కోట నియోజక వర్గాల పరిధిలో పంట రాక ఆలస్యమైన కారణంగా ఆ ప్రాంతాల నుంచి సుమారు 50 వేల టన్నులు రావలసి వుందని, ఈ నెలాఖరు నాటికి ఆ పంట కూడా వచ్చే అవకాశం వుందన్నారు.

దీనికి అదనంగా ఈ ఏడాది నిర్వహించిన పంటకోత ప్రయోగాల ప్రకారం అదనపు దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసినందున అదనపు ధాన్యం సేకరణ అవసరమవుతుందని భావించి మరో 30 వేల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించనున్నట్టు మంత్రి చెప్పారు.

**అంబేద్కర్ స్మృతివనం ప్రారంభానికి బడుగు బలహీనవర్గాల వారంతా తరలి రావాలి**

రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ స్వరాజ్య మైదానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లాలోని బడుగు బలహీన వర్గాల ప్రజానీకం తరలి రావాలని మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ ఈనెల 19న జరిగే ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పాల్గొన్నారు.

# గొప్ప పర్యాటక కేంద్రంగా రూపొందనున్న డా॥అంబేద్కర్ స్మృతివనం



**విజయనగరం:** రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ స్వరాజ్ మైదానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణకు జిల్లా ప్రజానీకం పెద్ద ఎత్తున తరలి రావాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం నగరానికి వచ్చిన ఎస్.సి. కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ స్థానిక జిల్లాపరిషత్ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో అన్ని రకాల వసతులతో విజయవాడ నడిబొడ్డున 20 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత విలువైన ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డా॥ అంబేద్కర్ స్మృతివనం గొప్ప పర్యాటక కేంద్రంగా రూపొందబోతోందని పేర్కొన్నారు. యీ స్మృతివనంలో 3 వేల మంది కూర్చొనేందుకు వీలుగా మల్టిపర్పస్ కన్వెన్షన్ హాలు, 2 వేల మంది కూర్చొనేందుకు వీలుగా ఓపెన్ ఎయిర్ థియేటర్, 10 వేల పుస్తకాలతో భారీ గ్రంథాలయం వంటివి ఏర్పాటు కానున్నట్టు తెలిపారు. దేశంలోని 140 కోట్ల ప్రజలకు సమాన హక్కులు కల్పించి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం తన రాజ్యాంగం ద్వారా అందించిన మహనీయుడని చెప్పారు. రాష్ట్ర ప్రజలంతా పెద్ద ఎత్తున తాము పాల్గొనడంతో పాటు తమ మిత్రులు, తెలిసిన వారంతం లక్షలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా సోషల్ మీడియా, మొబైల్ ఫోన్‌ల ద్వారా ఈ సందేశాన్ని చేరవేయాలని కోరారు. డా॥అంబేద్కర్ విగ్రహం సమానత్వానికి, స్వేచ్ఛకు, విజ్ఞానానికి చిహ్నమని పేర్కొన్నారు.

విలేకరుల సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, ఎస్.సి. కార్పొరేషన్ ఇ.డి. సుధా రాణి, డి.ఎస్.పి. గోవిందరావు, జిల్లా ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ కమిటీ సభ్యుడు బొంగ భానుమూర్తి, నగర కార్పొరేటర్ దాసరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.సి.కమిషన్ ఛైర్మన్‌ను కలసిన జిల్లా కలెక్టర్, ఎస్.పి.**

జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం నగరానికి చేరుకున్న రాష్ట్ర ఎస్.సి. కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ దీపిక పాటిల్ స్థానిక జిల్లాపరిషత్ అతిథి గృహంలో కలిశారు. జిల్లాలో ఎస్.సి.ల రక్షణ, వారి సంక్షేమానికి సంబంధించి జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై వారు ఛైర్మన్‌తో చర్చించారు. ఎస్.సి.లు ఏదైనా సమస్యను విన్నవించుకోవడానికి అధికారుల వద్దకు వచ్చినపుడు వారి సమస్యలను సావధానంగా ఆలకించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల ప్రతినిధులు ఎస్.సి.కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశారు.

# ఘనంగా నుదురుపాటి తాతాజీ షష్టిపూర్తి వేడుకలు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక ప్రముఖ వ్యాపార వేత్త, సిద్ధ లింగేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్, నుదురుపాటి తాతాజీ జన్మదినం సందర్భంగా బుధవారం చిన్న వీధిలో తన సొంత నిధులతో నిర్మించిన నుదుటిపాటి వరహాలు కళ్యాణ మండపంలో జన్మదిన షష్టిపూర్తి వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు, అన్నమాచార్యుల కీర్తనలు భక్తులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం నిరుపేదలకు నిత్యవసర వస్తువులు, చీరలు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది 60 సంవత్సరాల పూర్తి చేసిన సందర్భంగా 60 మంది నిరుపేదలకు నిత్యవసర వస్తువులు బట్టలు పంపిణీ జరిగిందన్నారు, ప్రతి ఏడాది తను ఎన్ని సంవత్సరాలు వస్తే అంతమందికి సేవా కార్యక్రమాలు



చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. తాతాజీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన వారు, దాడి రత్నాకర్, మలసాల భరత్ కుమార్, మందపాటి జానకిరామరాజు, కొణతాల మురళీకృష్ణ, మలసాల రమణరావు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, జాజుల రమేష్, కడిమిశెట్టి సతీష్, గుండా రమేష్ గుప్తా, ఆరెపు కామేష్, కే పి వి రమణయ్య, బిళ్లాపాటి కృష్ణకుమార్, దేవాలయ ఛైర్మన్లు ధర్మకర్తలు, వాసవి క్లబ్ సభ్యులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా టిడిపి 83వ వార్డ్ ఇన్‌చార్జ్ బొద్దపుప్రసాద్ జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక వేల్పులవీధి సీతారామ కళ్యాణ మండపంలో 83వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బొద్దపు ప్రసాద్ జన్మదిన వేడుకలు అటహాసంగా జరిగాయి.

మళ్ళ సురేంద్ర అధ్యక్షత వహించిన జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి మాజీ శాససనభ్యులు నియోజక వర్గం ఇన్‌చార్జ్ పీలా గోవింద సత్య నారాయణ, చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాథరావు, సినీ నటులు మొల్లేటి బాలాజీ, ప్రసన్న కుమార్, జబర్దస్త్ సత్తిపండు, దర్శకులు ఆడారి మూర్తి సాయి, పాల్గొని కేక్ కట్ చేయించి ఘనంగా సత్కరించారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీలా గోవింద్ మాట్లాడుతూ ఒక కమిట్మెంట్ ఉన్న నాయకుడు నిరంతరం పార్టీ శ్రామికుడు అనకాపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుగా నేను అనకాపల్లికి వచ్చిన మొదటి నుంచి ఇప్పటివరకు కూడా నాతో అడుగులు వేస్తూ పార్టీ కష్ట కాలంలో కూడా నేనున్నానని ముందుకి వచ్చి కార్పొరేటర్ అభ్యర్థి వాళ్ళ కుటుంబ సభ్యుల్లో ఒకరిని నిలబెట్టి ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పార్టీని వీడకుండా పార్టీకి సేవ చేస్తూ అందరూ నావాలే అనే అంకిత భావంతో భావిస్తూ నిరంతరం ప్రజలే నా వాళ్ళని మంచి గొప్ప మనసున్న వ్యక్తి ప్రసాద్ అని తెలియజేశారు

ఈ కార్యక్రమంలో

84వ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు, 80వ డివిజన్ ఇంచార్జ్ 82వ డివిజన్ బొడ్డెడ జోగి నాయుడు, ఇంచార్జ్ పోలరపు త్రినాథ్, అనకాపల్లి మండల ప్రెసిడెంట్ కాయల మురళీధర్, గొంతున శ్రీనివాసరావు, ములమపాక మండల ప్రెసిడెంట్ దొడ్డి శీను, కొణతాల రత్నకుమారి, పిట్ల రాజు, దాడి జగన్, పొలిమేర ఆనంద్, ప్రసాద్ మిత్రమండలి సభ్యులు నూకరాజు (కమాండో), రవిశంకర్, చిట్టి, ఉమామహేశ్వరరావు, శీను, దొడ్డి రాము, రియాజ్, వాకాడ మదన్, మరియు వేల్పులవీధి పెద్దలు, జనసేన నాయకులు, పురప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.




# పిచ్చెక్కిస్తా పానీపూరి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలో పిచ్చెక్కిస్తాం అంటూ బీచ్‌రోడ్డులో ఒక పానీపూరి దుకాణం వెలిసింది. పిచ్చివాళ్ళ కావాలనుకునే వాళ్లు హాయిగా ఇక్కడ పానీపూరి తినొచ్చు.









VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676